ఉన్మాదం

- ప్రేమించలేదని అక్కసుతో యువతిపై రాడ్డుతో దాడి
- పరారీలో నిందితుడు...



దాడి చేసిన నీరజ్‌శర్మ

తన ప్రేమను నిరాకరించిందని అక్కసుతో యువతిపై ఓ ఉన్మాది ఇనుపరాడ్డుతో దాడి చేశాడు.

-మెయిన్ 3లో

భారీ వాహనాల ఇష్టారాజ్యం

నగరంలోని అంతర్గత రహదారుల్లో రాకపోకలకు వేళలు నిర్దేశించిన ప్రభుత్వం

- రాత్రి 10 నుంచి ఉదయం 7 గంటల వరకూ మాత్రమే అనుమతి
- ఒకవేళ ఆ సమయంలో లోడింగ్/అన్‌లోడింగ్ పూర్తికాకుంటే సమీపంలో నిలుపుకోవలసిందే...
- ముందస్తు అనుమతి ఉంటేనే మధ్యాహ్నం 12-4 గంటల మధ్య ఓకే
- కానీ, రోజంతా కొనసాగుతున్న రాకపోకలు
- దాంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, తరచూ రోడ్డు ప్రమాదాలు
- అయినా పట్టించుకోని ట్రాఫిక్ సిబ్బంది
- మామూళ్లు అందుతుండడమే కారణమని ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో భారీ వాహనాలు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారిపై కాకుండా అంతర్గత రోడ్లపై రాకపోకలకు నిర్దేశిత సమయం ఉంటుంది. అయితే అదేమీ పట్టించుకోకుండా రద్దీ వేళల్లో కూడా భారీ వాహనాలు వచ్చి,వెళుతున్నాయి. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది అధికారులు వాహనాల యజమానులు, వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుంటుండడం వల్లే అలా వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సీతంపేట నుంచి జాతీయ రహదారి వైపునకు వెళుతున్న లారీ

రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం కొన్ని నిబంధనలను విధించింది. అందులో భాగంగా రద్దీ ఎక్కువగా ఉండే వేళల్లో భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా నిషేధం విధించింది. భారీ వాహనాలు జాతీయ రహదారి పైనుంచి మాత్రం ఏ సమయంలోనైనా రాకపోకలు సాగించుకోవచ్చు. కానీ నగరంలోని అంతర్గత రహదారుల్లోకి ప్రవేశించాలంటే మాత్రం నిర్దేశిత సమయాన్ని కేటాయించింది. రాత్రి పది గంటల తర్వాత మరుసటిరోజు ఉదయం ఏడు గంటల వరకూ అంతర్గత రోడ్లపై వాహనాల రద్దీ, జన సంచారం పెద్దగా ఉండదు కాబట్టి ఆ సమయంలో మాత్రమే రవాణా వాహనాలు, ఇతర భారీ వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించింది. మిగిలిన సమయాల్లో కంటెయినర్లు, సరకు రవాణా చేసే లారీలు, భవన నిర్మాణ సామగ్రి రవాణా వాహనాలు, ఆరు చక్రాలు అంతకంటే పెద్ద వాహనాలు ఏవైనా సరే నగర సరిహద్దులో నిలిపేయాల్సి ఉంటుంది. రాత్రి పది గంటల తర్వాత వాహనాలు అక్కడి నుంచి బయలుదేరి నగరంలోకి ప్రవేశించి గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది. సరకు అన్‌లోడింగ్ చేసిన తర్వాత ఉదయం ఏడుగంటల్లోగా నగరం నుంచి బయటకు వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఒకవేళ



మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళుతున్న లారీ

అన్‌లోడింగ్ ఆలస్యమైతే అదే ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేనిచోట పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

అయితే భారీ కంటెయినర్లు, సరకు రవాణా వాహనాలు రద్దీ వేళల్లో సైతం నగరంలోని అంతర్గత రహదారుల్లోకి వచ్చేస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడం, రోడ్డు ... మిగతా 6వ పేజీలో

15 మాస్టర్‌ప్లాన్ రహదారులు అభివృద్ధి

జీవీఎంసీతో కలిసి వీఎంఆర్‌డీఏ ప్రణాళిక

- మొత్తం 87.54 కిలోమీటర్లు
- రూ.403.67 కోట్ల వ్యయం
- బీచ్‌రోడ్డు 210 అడుగులు, బీఆర్‌టీఎస్ 150 అడుగులు
- మరికొన్ని 60 అడుగుల నుంచి 100 అడుగుల వెడల్పున విస్తరణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేయాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మొత్తం 15 రహదారులను జీవీఎంసీతో కలిసి విస్తరించాలని నిర్ణయించింది. జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గించేందుకు భీమిలి బీచ్ రోడ్డును కలిపేలా కొన్ని రహదారులను, ఎన్‌ఏడీ వద్ద రద్దీ తగ్గించేందుకు అడవివరం నుంచి శొంఠ్యాం మీదుగా మరో రహదారి...ఇలా అవసరమైన మార్గాలను గుర్తించింది.

పెందుర్తి, ఆనందపురం, భీమిలి, డెంకాడ, విజయనగరం ప్రాంతాలను కలుపుతూ విస్తరించే ఈ 15 రహదారులకు రూ.403.67 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. వీటిలో కొన్ని రహదారులు పంచాయతీరాజ్, మరికొన్ని ఆర్ అండ్ బి, ఇంకొన్ని జీవీఎంసీ నిర్వహణలో ఉన్నాయి. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మించనున్నారు. జాతీయ రహదారి, భీమిలి బీచ్ కారిడార్ 210 అడుగులు, బీఆర్‌టీఎస్ మార్గం 150 అడుగులకు విస్తరించి, మిగిలిన వాటిని రద్దీకి అనుగుణంగా 60 అడుగుల నుంచి 100 అడుగులకు అభివృద్ధి చేస్తారు.

- భీమిలి మండలం చిప్పాడ నుంచి విజయనగరం జిల్లాలో పోలిపల్లి వరకూ 6.32 కి.మీ. పొడవున 80 అడుగుల రహదారి వేస్తారు. దీనికి రూ.37.92 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

- జీవీఎంసీ 18వ వార్డులో శివశక్తి నగర్ నుంచి వుడా హరిత ప్రాజెక్టు వరకూ 1.7 కి.మీ. రహదారిని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించేందుకు రూ.7.65 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

- పరదేశిపాలెం నుంచి గంభీరం వరకు 1.4 కి.మీ. పొడవున 60 అడుగుల రహదారి నిర్మాణానికి రూ.5.04 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.
- అడవివరం బీఆర్‌టీఎస్ జంక్షన్ (శొంఠ్యాం రహదారి) నుంచి గండిగుండం వరకూ 8 కి.మీ. పొడవున 180 అడుగుల రహదారి వేయడానికి రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు.
- నేరెళ్లవలస నుంచి దొరతోట మీదుగా కొత్తవలసకు 80 అడుగుల వెడల్పున 4 కి.మీ. రహదారికి రూ.24 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.
- తగరపువలస నుంచి మూలకుద్దు వరకూ ప్రస్తుతం ఉన్న 3.6 కిలోమీటర్ల రహదారిని 150 అడుగులకు విస్తరించడానికి రూ.18 కోట్లు అవసరమని నిర్ణయించారు.
- మూలకుద్దు బీచ్‌రోడ్డు నుంచి నేరెళ్లవలస వరకూ 5.52 కి.మీ. రహదారిని 210 అడుగుల మేర విస్తరించడానికి రూ.33.12 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.
- పినగాడి జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకూ ప్రస్తుతం ఉన్న రహదారి (7.25 కి.మీ)ని 150 అడుగులకు విస్తరించడానికి రూ.36.25 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు.
- వేపగుంట నుంచి జుత్తాడ వరకు 80 అడుగుల వెడల్పున 6.05 కి.మీ. రహదారి నిర్మించడానికి రూ.36.3 కోట్లు వెచ్చిస్తారు.
- ఆనందపురం మండలం వెల్లంకిలో దొరతోట రోడ్ జంక్షన్ నుంచి కుమ్మరిపాలెం వరకు ఉన్న రహదారిని 180 అడుగులకు 6.20 కి.మీ. మేర విస్తరిస్తారు. దీనికి రూ.31 కోట్లు అవసరం అవుతాయని అంచనా.
- పరదేశిపాలెంలో బోయపాలెం జంక్షన్ నుంచి కాపులుప్పాడ మంగమారిపేట జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 100 అడుగులకు విస్తరించడానికి రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించారు.
- జాతీయ రహదారిపై ... మిగతా 6వ పేజీలో

సికింద్రాబాద్-లక్నో మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా సికింద్రాబాద్-లక్నో మధ్య ప్రత్యేక రైలు సర్వీస్ ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07084 నంబరు గల రైలు ఈనెల 15, 22 తేదీల్లో రాత్రి 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు లక్నో ... మిగతా 6వ పేజీలో

కార్పొరేషన్లలో మరో ముగ్గురికి అవకాశం

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తూర్పు కాపు, మాదిగ, తదితర కార్పొరేషన్లకు సభ్యులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తూర్పు కాపు కార్పొరేషన్‌లో భీమిలి నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన కురిమిన లీలావతికి అవకాశం లభించింది. మాదిగ కార్పొరేషన్‌లో సభ్యులుగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాతకు, ఎలమంచిలి నుంచి టీడీపీకి చెందిన డొక్కా నాగభూషణం నియమితులయ్యారు.

అక్రమం పక్కా... అధికారులు ఓ లెక్కా!

- బాలాజీనగర్‌లో రహదారిని ఆక్రమించి గృహ నిర్మాణం
- బరితెగించిన బిల్డర్



పురుషోత్తపురం బాలాజీనగర్‌లో రహదారిని ఆక్రమించి చేపడుతున్న గృహ నిర్మాణం

పెందుర్తి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం పురుషోత్తపురం బాలాజీనగర్‌లో ఓ బిల్డర్ రహదారిని ఆక్రమించి గ్రూపు హౌస్ నిర్మిస్తున్నారు. ఇక్కడి బీఆర్టీఎస్ రహదారికి అతి సమీపంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ వెనుక బాలాజీ నగర్ కాలనీలో రామా కో-ఆపరేటివ్ సొసైటీ తరఫున కొంతమంది ఉద్యోగులు స్థలాలు కొనుగోలు చేసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో 24 అడుగుల వైశాల్యం గల రహదారిని అధికారికంగా లేఅవుట్‌లో చూపించారు. ఆ ప్రకారంగానే నివాసితులు నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల ఓ బిల్డరు రంగ ప్రవేశం చేసి ప్లాట్ నంబరు 33 లోని స్థలాన్ని రెండుగా విభజించి నిబంధనలకు విరుద్ధంగా, కనీసం సెట్ బ్యాక్‌లు కూడా వదలకుండా గ్రూపు హౌస్‌ల నిర్మాణం చేపట్టారు. పనిలో పనిగా ప్రధాన రహదారికి కేటాయించిన 24 అడుగుల వైశాల్యం గల స్థలంలో 8 అడుగులు మేర ఆక్రమించేశారు. ఈ విషయం తెలిసిన కాలనీ వాసులు మూకుమ్మడిగా వెళ్లి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఒత్తిడి చేశారు. అయినా బిల్డరు లెక్క చేయలేదు. దీంతో కాలనీవాసులు రెండుసార్లు వేపగుంట జోనల్ కార్యాలయంలో జడ్సీ, ప్రణాళికా విభాగం అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు నిర్మాణ ప్రాంతానికి వెళ్లి అతిక్రమణను ధ్రువీకరిస్తూ, తక్షణమే పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. ఇంత జరిగినా బిల్డర్ దర్జాగా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జడ్సీని వివరణ కోరడానికి ఆంధ్రజ్యోతి ప్రతినిధి యత్నించగా ఆయన అందుబాటులో లేరు.

మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణం

- సెట్ బ్యాక్స్ విడిచిపెట్టకుండా పనులు
- చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు



మద్దిలపాలెం దేవి హోమ్స్ రోడ్డులో నిర్మిస్తున్న భవనం

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 23వ వార్డులో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు ఒకలా పొంది వాటికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మద్దిలపాలెంలో ... మిగతా 6వ పేజీలో

నైవేద్యానికి నోచుకోని నారాయణుడు!

- ధూప, దీపాలు కూడా కరువు
- అప్పన్న ఆలయ అధికారుల నిర్లక్ష్యం



నిరాదరణలో వైకుంఠనారాయణుని ఆలయం

సింహాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరిపై ఈశాన్య దిశగా ఉన్న వైకుంఠ నారాయణుడికి కనీసం నైవేద్యం కూడా పెట్టడం లేదు. దేవాలయంలో గతంలో లభించిన ఒక శాసనం ద్వారా వైకుంఠ నారాయణుని సేవలకు ప్రత్యేకంగా దిట్టం, వ్యవస్థ ఉన్నట్టు తెలుస్తోంది. అటువంటి వ్యవస్థ కాలగమనంలో పూర్తిగా కనుమరుగైంది. సకాలంలో వర్షాలు కురవకపోతే వరుణుని ప్రార్థిస్తూ వరద పాయసం బండలపై జారపోస్తుంటారు. ఆ సమయంలో మాత్రమే సమీపాన గల నారాయణస్వామికి ప్రత్యేక పూజలు, వరుణ పారాయణ జరుపుతున్నారు. అయితే భక్తుల కోర్కె మేరకు వైకుంఠ నారాయణుడికి నిత్యం ధూప, దీపాలకు, నివేదనలు చేయాల్సిందిగా ఈఓగా సూర్యకళ ఉన్న సమయంలో అప్పన్న ఆలయ వైదికులను ఆదేశించి, దానిని అమలు చేయించారు. అదే సాకుతో కొందరు వైదికులను ఆలయ అధికారులు నియమించుకున్నారు. ఆ విధానం కొంతకాలం మాత్రమే జరిగింది. తరువాత అది నిలిచిపోయినా, అప్పుడు నియమించబడ్డ వారు మాత్రం కొనసాగుతుండడం గమనార్హం. ఇదే ప్రాంతంలో ... మిగతా 6వ పేజీలో

గోస్తనీలో పడిన కారు!

- డ్రైవర్ మృతి
- బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం



మృతి చెందిన మాదాబత్తులు సురేంద్ర

తగరపువలస, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తగరపువలస వద్ద గల గోస్తనీ వంతెన పైనుంచి గురువారం రాత్రి ఒక కారు కింద ఉన్న నదిలో పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ మాదాబత్తులు సురేంద్ర (24) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... విశాఖపట్నం నుంచి భోగాపురం వైపు వెళుతున్న కారు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వంతెన రెయిలింగ్‌ను ఢీకొని నదిలో పడిపోయింది. ఓ ఆటో డ్రైవర్ చూసి స్థానికులకు సమాచారం అందించడంతో వంతెన కింద నుంచి గోస్తనీ నది వద్దకు వెళ్లి కారులో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. అంబులెన్స్‌లో సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. మృతుడు సురేంద్ర తగరపువలస సమీపంలో ఉన్న బంగ్లామెట్ట ప్రాంతానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు చేస్తున్న ఓ కంపెనీలో కొత్తగా చేరాడని, విశాఖపట్నంలో పని ముగించుకుని వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నదిలో పడిపోయిన కారును బయటకు తీయడానికి ఇబ్బందిగా ఉందని, ఆ ప్రాంతమంతా తుప్పలు డొంకలతో నిండి ఉండడంతో లోపలకు వెళ్లడం సాధ్యం కాలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ వంతెనపై లైట్లు లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బుధవారం కూడా ఈ వంతెనపై రెయిలింగ్‌ను ఢీకొని ఒక ఆటో దెబ్బతిందని తెలిసింది. ఇప్పటికైనా అధికా రులు గోస్తనీ నది బ్రిడ్జిపై విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సదరం... గందరగోళం

- స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో పరీక్షకు స్లాట్లు లభించకుంటే పొరుగు జిల్లాల ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి
- దూరాభారం కావడంతో దివ్యాంగుల ఆందోళన
- అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చిన సమస్య

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'సదరం' వెబ్‌సైట్‌లో స్లాట్ల కేటాయింపు సక్రమంగా లేదనే వాదన వినిపిస్తోంది. దీనిపై అసెంబ్లీలో గురువారం చర్చ జరిగింది. విశాఖ జిల్లాకు చెందిన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఈ సమస్యను ప్రస్తావించారు. ఎవరైనా దివ్యాంగులు సర్టిఫికెట్ కావాలనుకుంటే...వారిని స్లాట్ ఖాళీ లేదనే కారణంతో పొరుగు జిల్లాలకు వెళ్లమంటున్నారని, ఇది దూరాభారంతో కూడుకున్నదని సభ దృష్టికి తెచ్చారు.



ఏమి జరుగుతున్నదంటే...?

సదరంలో ఇచ్చే దివ్యాంగుల సర్టిఫికెట్లకు భారీగా డిమాండ్ ఉంది. ప్రభుత్వం ప్రతి నెలా ఇంతమందికి సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతూ సమీప ఏరియా ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తోంది. ఇందుకోసం ముందుగానే ప్రకటన జారీ చేస్తున్నారు. రైళ్లకు తత్కాల్ టిక్కెట్లు ఇవ్వడానికి ఎలా ఒక సమయం కేటాయిస్తారో...వీటికీ అలాగే చేస్తున్నారు. గతంలో ... మిగతా 6వ పేజీలో

మధుమేహం పట్ల అప్రమత్తం

కొమ్మాది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధుమేహాన్ని ముందుగా గుర్తించి, నియంత్రించుకుంటే ఎలాంటి సమస్య ఉండదని గాయత్రి విద్యా పరిషత్ ఆసుపత్రి డీన్ సుబ్బారావు అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సును గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు ప్రారంభించారు. అనంతరం రోగులకు బ్లడ్ షుగర్, రెటినోపతి స్క్రీనింగ్, కార్డియాక్ స్క్రీనింగ్, బాడీ మాస్ కంపోజిషన్, డయాబెటిక్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అలాగే మధుమేహంపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురంలో ర్యాలీ

ఆనందపురం : వేములవలస జంక్షన్‌లో వరల్డ్ డయాబెటిక్ డే పురస్కరించుకుని గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు గంగునాయుడు మాట్లాడుతూ మధుమేహం అశ్రద్ధ చేస్తే ప్రమాదమని, సూచనలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రతించాలని సూచించారు. అనంతరం ఆర్‌ఎంపీ వైద్యులు కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు.

ధరల నియంత్రణలో విఫలం

కొమ్మాది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కుమార్ విమర్శించారు. గురువారం ఆ పార్టీ నాయకులు జోన్ -2 కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మధురవాడ మార్కెట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అప్పలరాజు, పి. రాజ్‌కుమార్, కొండమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అవంతి విద్యార్థి ప్రతిభ

తగరపువలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో నాలుగో ఏడాది చదువుతున్న ఎ. తులసీరావు అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం పొందాడు. రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో 110 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించాడు. విద్యార్థిని గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ : జడ్సీ

తగరపువలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలసలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని స్పెయిన్ దేశానికి చెందిన దంపతులు గురువారం దర్శించుకున్నారు. హైందవ సంస్కృతీ సంప్రదాయం ప్రకారం నుదట బొట్టు ధరించడంతో పాటు విదేశీ మహిళ చీరకట్టుతో ఆకట్టుకున్నారు. సాధారణ భక్తులతో పాటు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

అయ్యప్ప పీఠం నిర్మాణానికి రూ. లక్ష ఆర్థిక సాయం

ఆనందపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కణమాం పంచాయతీలో స్వామి మాలలు వేసుకున్న భక్తులకు గిడిజాలకు చెందిన మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని పంచాయతీలో పీఠం నిర్మాణానికి వినియోగిస్తామని స్వాములు తెలిపారు.

వరహగిరినగర్‌లో జెడ్సీ పర్యటన

ఎండాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ వరహగిరినగర్‌లో జోన్-2 జడ్సీ సింహాచలం శుక్రవారం పర్యటించారు. కాలనీలో పారిశుధ్యం నిర్వహణతో పాటు కాలువలు, రోడ్లు పరిశీలించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానికులకు సూచించారు.

విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలి : సీపీఎం

భీమునిపట్నం,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ తక్షణమే విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం ఆ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వాటికి తోడు విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు కూడా భారీగా పెంచారని విమర్శించారు. తక్షణమే ఆయా ధరలను తగ్గించాలని లేదా ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు వల్లే వైసీపీ అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. అనంతరం హెచ్‌డిటి శ్రీనుబాబుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవ్వ నరసింగరావు, అప్పలనాయుడు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు : కలెక్టర్

ఆనందపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండ్లు, కూరగాయల సేకరణ కేంద్రాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గురువారం సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న పండ్లు, కూరగాయల ఉత్పత్తి, సేకరణ నుంచి మార్కెట్ వరకు జరిగే అన్ని వివరాలను నిర్వాహకురాలు బిందు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం గ్రామంలోని మహిళా రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలెక్టర్ సమావేశమైన వారి పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించే పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా చిరు ధాన్యాలతో పాటు పండ్లు, కూరగాయలు సేకరణ కూడా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారాదా ప్రియాంక, సర్పంచ్ బీఅబీ నాయుడు, ఎంపీడీవో డాక్టర్ జానకి, జిల్లా ఉద్యానవన శాఖా ధికారి కె. సత్యన్నారాయణ, వ్యవసాయ శాఖ డీపీఎం మోహనరావు, ఉద్యానవన శాఖ డిడి మన్మథరావు, ఉద్యానవన శాఖ అధికారి స్వాతి, ప్రకృతి వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త కొంగర రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

సాగర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే ఆత్మవిశ్వాసమే సోపానమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. గీతంలో జరుగుతున్న జవహర్ నవోదయ విద్యాలయాల ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టిసారించాలన్నారు. యువత ప్రపంచంలోని మేటి సంస్థలకు కీలక స్థానాల్లో పనిచేయడం గమనిస్తే ప్రపంచంలో ఎలాంటి పోటీకి అయినా సరితూగగలరన్న నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమరావు, జవహర్ నవోదయ విద్యాలయ సమితి సహాయ కమిషనర్ డాక్టర్ ఉమాపతిరెడ్డి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రదాత పీవీజీ రాజు : ఈఓ



పీవీజీ రాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈఓ

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పలు ఆధ్యాత్మిక సంస్థలకు వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎంపీ పీవీజీ రాజు విద్యా ప్రదాత అని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు కొనియాడారు. పీవీజీ 29వ వర్ధంతి పురస్కరించుకుని దేవస్థానానికి చెందిన నృసింహవనంలో ఉన్న ఆయన విగ్రహానికి ఈఓ పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజరికపు కుటుంబంలో జన్మించి సాధారణ దాత వలే అనేక ఆధ్యాత్మిక సంస్థలకు కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులను దానంగా అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు కేకే రాజేంద్రకుమార్, డీవీఎస్ రామరాజు (హరి), పి. సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

భావిభారత పౌరులు.. బాలలు

బాలల దినోత్సవంలో విశాఖ ఎంపీ శ్రీభరత్

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని చోట్లా బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి,నివాళి అర్పించారు. అలాగే భీమిలి కేజీబీవీలో జరిగిన వేడుకల్లో బాలికలకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ఎస్ఎంసీ ఛైర్మన్ చందవరపు కుమార్, జీసీడీవో కలీషా బేగం, తదితరులు పాల్గొన్నారు. నేరెళ్లవలసలో ఉన్న ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో జడ్సీ ప్రసన్న వాణి బాలలకు మిఠాయిలు పంచిపెట్టారు. ది సన్ స్కూల్‌లో పాఠశాల ప్రెసిడెంట్ లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లోనూ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక



సాగర్‌నగర్ : నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీ శ్రీభరత్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. వేములవలస, ఆనందపురం, వెల్లంకి, రామవరం, గండిగుండం, శొంఠ్యాం, గిడిజాల, తర్లువాడ, చందక, కుసులువాడ, బోని తదితర పంచాయతీల్లోనూ వేడుకలు జరిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

సాగర్‌నగర్ : నేటి బాలలే నవ భారత నిర్మాతలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా గురువారం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ బోధన జరుగుతుందన్నారు.దేశంలో పెట్టుబడులు పెరిగి యువతకు అవకాశాలు వృద్ధి చెందడం వల్ల మేథో వలస తగ్గుతుందన్నారు.ఇంజనీరింగ్ చదివే వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగాలు తగ్గుతున్నాయన్నారు.

ఎండాడలో..

ఎండాడ : శ్రీరామ పనోరమ హిల్స్, సెలబ్రిటీ టవర్స్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులకు ఆటలు, పాటలు, క్విజ్, రైమ్స్ పోటీలు జరిపారు. విజేతలకు టవర్స్‌లోని బ్లాక్ -2 అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ రొక్కం రావుతో పాటు పలు స్కూళ్ల ప్రిన్సిపాళ్లు బహుమతులు ఇచ్చారు.

పైడితల్లమ్మ ఆలయ పరిచారకుడి సస్పెన్షన్

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ దేవత పైడితల్లెమ్మ ఆలయ పరిచారకుడు ఎం. సుబ్బారావును సస్పెండ్ చేస్తూ సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 17న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా పెందుర్తి ప్రాంతానికి చెందిన ఎం. అశోక్ సింహాచలం దేవస్థానం ఒకప్పటి లీజెస్ విభాగం, ప్రస్తుత పారిశుధ్య విభాగం పర్యవేక్షణాధికారిగా పనిచేస్తున్న రాజలక్ష్మిపై ముఖ్యమంత్రికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమె దురుసుగా ప్రవర్తిస్తున్నారని, లంచాలు తీసుకున్నారని ఆరోపణలు చేశారు. సీఎం ఆదేశాల మేరకు దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ ఆమెపై వచ్చిన ఆరోపణలను విచారించి తగు చర్యలు తీసుకోవాలంటూ ఈఓను ఆదేశించారు. దేవస్థానం డిప్యూటీ ఈఓగా విధులు నిర్వహిస్తున్న సింగం రాధను ఏకసభ్య విచారణ కమిటీగా నియమిస్తూ ఈఓ ఆదేశాలిచ్చారు. కాగా పైడితల్లెమ్మ సన్నిధిలో పరిచారకుడిగా పనిచేస్తున్న సుబ్బారావుపై బీజేపీ మహిళామోర్చా నేత మాధవీ లత ఇటీవల ఈఓకు చేసిన ఫిర్యాదు మేరకు విధుల నుంచి సస్పెండ్ చేశారు.

చిప్పాడలో విద్యార్థుల ర్యాలీ



భీమునిపట్నం (రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్, ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల జరిగే అనర్థాలు, మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను తెలియజేస్తూ చిప్పాడ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు దివీస్ కంపెనీ సౌజన్యంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి రూ. 20 వేలు విలువైన బహుమతులు అందించారు.

హైస్కూల్ వందేళ్ల ఉత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఆ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవం కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ వచ్చే నెల 28, 29 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయన్నారు. తొలి రోజు ప్రారంభ సభ, పూర్వ విద్యార్థులతో సమావేశాల నిర్వహణ, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 29న ముగింపు వేడుకలు జరుగుతాయని తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనలు, సలహాల మేరకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకున్న వారికి ఉచితంగా ప్రమాద బీమా కల్పిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు తెలిపారు. ఏడో వార్డు పరిధిలోని మధురవాడ ఆదిత్యనగర్‌లో గురువారం విశాఖ పార్లమెంటు కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వ ర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈసారి రెట్టింపు సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి కానూరి అచ్చుతరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, బయపల్లి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

కొమ్మాది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గురువారం ఆమె విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాధాకృష్ణుల మహోత్సవం

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డులో కార్తీక శుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని శుక్రవారం రాధాకృష్ణుల మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గం యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయన్నారు.

సదరం... గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ప్రతి నెలా స్లాట్ బుకింగ్ సమయం ఇచ్చేవారు. ఇటీవల రెండు నెలలకు ఒకేసారి స్లాట్లు ఇస్తున్నారు. అక్టోబరు, నవంబరు నెలల స్లాట్లు అక్టోబరులోనే ఇచ్చేశారు. అయితే ఈఎన్‌టీ, తదితర సమస్యలు ఉన్నవారికి సర్టిఫికెట్ల జారీలో పెద్దగా ఇబ్బంది లేదు. ఇతరత్రా సమస్యలు ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల పొరుగునున్న జిల్లాల ఆస్పత్రులకు వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. ఉదాహరణకు విశాఖ జిల్లాలో కేజీహెచ్ కావాలని చాలామంది ఆప్షన్ తీసుకుంటున్నారు. ఆ స్లాట్లు అయిపోగానే పక్కనే ఉన్న అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఏరియా ఆస్పత్రులలో ఖాళీ స్లాట్లు ఉన్నాయని, అక్కడకు వెళ్లవచ్చునని సచివాలయాల సిబ్బంది సూచిస్తున్నారు. సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలనుకునేవారు దూరాభారం అయినా తప్పనిసరై అక్కడకు వెళుతున్నారు. 100 శాతం వైకల్యం కలిగిన వారికి సహాయంగా మరొకరు అంతదూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య పెద్ద జిల్లాల్లో ఎక్కువగా ఉన్నందున దీనికి పరిష్కారం చూపించాల్సి ఉంది. ఇటీవల డాబాగార్డెన్స్‌కు చెందిన ఓ మహిళ సదరం స్లాట్ కావాలని సచివాలయానికి వెళితే...కేజీహెచ్‌లో లేదని అనకాపల్లి వెళ్లాలని సూచించారు. అలాగే మరికొందరికి పాడేరు, నర్సీపట్నం వెళ్లాల్సిందిగా చెబుతున్నారు. విశాఖలో స్లాట్లు ఖాళీ లేనందునే పక్కనే ఉన్న ఏరియా ఆస్పత్రులను సూచిస్తున్నామని, వారికి ఇష్టం లేకపోతే విశాఖలో స్లాటు దొరికే వరకు వేచి ఉండవచ్చునని, అందులో బలవంతం ఏమీ ఉండదని సిబ్బంది చెబుతున్నారు. దీనికి అధికారులు ఏ విధంగా పరిష్కారం చూపిస్తారో చూడాల్సి ఉంది.

నైవేద్యానికి నోచుకోని నారాయణుడు!

... 5వ పేజీ తరువాయి

శ్రీకృష్ణదేవరాయలు విజయస్థూపాన్ని ఏర్పాటుచేయగా దానిని, వైకుంఠ నారాయణుని ఆలయాన్ని కలుపుతూ ప్రత్యేక టూరిజం వ్యవస్థను నెలకొలుపుతామంటూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ప్రస్తుత భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. అది కూడా నేటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దాంతో ఆలయాన్ని, విజయస్థూపాన్ని చూసే భాగ్యం భక్తులకు లభించడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్లే మార్గం కూడా చాలావరకు రాళ్లు తేలి ఇబ్బందికరంగా మారింది. దేవదాయ శాఖ అధికారులు ఇప్పటికైనా ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

విజ్ఞాన గనులు.. గ్రంథాలయాలు

» యువత సద్వినియోగం చేసుకోవాలి : వక్తలు

» వాడవాడలా వారోత్సవాలు ప్రారంభం

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లోనూ గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. భీమిలి పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, విద్యార్థులు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయాధికారి ప్రకాశ్ మాట్లాడుతూ ఈనెల 20 వరకూ వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వి. చంద్రశేఖర్, తాలూకా ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి. భీమారావు, రిటైర్డు హెచ్ఎం ఎస్. ఆనందరావు, రిటైర్డ్ పోర్టు కన్సర్వేటర్ ఎం. ఆనందరావు, కళా సాహితి అధ్యక్షుడు వర్మ, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఎం. లక్ష్మణరావు, జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



భీమిలి శాఖా గ్రంథాలయంలో వేడుకలు

సింహాచలంలో...

సింహాచలం :అడివివరం శాఖా గ్రంథాలయాభివృద్ధికి కృషి చేస్తానని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. గురువారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, రిటైర్డ్ హెచ్ఎం కె. సీతారామ్మూర్తి, న్యాయవాది కె. రామకృష్ణ, కార్మిక నేత సూర్యనారాయణ పాల్గొన్నారు. అంతకముందు నెహ్రూ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు.



జడ్సీకి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

భీమిలిలో మత్స్యకారుల మహా ధర్నా

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల జీవన విధానానికి భంగం కలిగించే కబ్జాదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు భారీ ప్రదర్శన ర్యాలీ, ధర్నా నిర్వహించారు.ముందుగా మండలంలోని తీర ప్రాంతాలైన అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చినవాగమయ్యపాలెం, ఎగువపేట, బోయవీధి, తోటవీధి, మంగమారిపేట, చేపలుప్పాడ, తిమ్మాపురం గ్రామాల నుంచి వందలాది మంది మత్స్యకారులు ఎగువపేట ముఖద్వారానికి చేరారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్, గంటస్తంభం, పాతబస్టాండ్ మీదుగా జీవీఎంసీ జోన్ వన్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, పేర్ల విజయచందర్ మాట్లాడుతూ సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సాగర తీరంలో జరుగుతున్న కట్టడాలకు ప్రభుత్వాలు ఎలా అనుమతులు మంజూరు చేస్తున్నాయని ప్రశ్నించారు. ఆఖరికి తీర ప్రాంతంలో మత్స్యకారులు వినియోగించుకుంటున్న శ్మశానవాటికలను కూడా బడాబాబులు కబ్జా చేసి రెస్టారెంట్‌లు, బార్‌లు, రేవు పార్టీలు నిర్వహిస్తుండడం దారుణమన్నారు. ఈ విషయమై పలుమార్లు వినతులు ఇచ్చినా.. అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటని నిలదీశారు. అలాగే తీరంలో రసాయన కంపెనీలు వ్యర్థాలు విడుదల చేస్తుండడంతో మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారుల జీవనానికి విఘాతం కలుగుతుందన్నారు. తీరంలో పడవలు, వలలు, తెప్పలు, వేట సామగ్రిని భద్రపర్చుకోవడానికి ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు జడ్సీ ప్రసన్న వాణికి వినతిపత్రం అందించారు. అలాగే జోనల్ కార్యాలయం వద్ద రిలే దీక్ష చేశారు. కార్యక్రమంలో నాయకులు పిసి అప్పారావు, చెన్నా దాసు, అల్లిపిల్లి నరసింగరావు, మైలపల్లి షణ్ముఖరావు, కారి అప్పారావు, విశాఖ మరబోట్ల యూనియన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలు చోటుచేసుకోవడం జరుగుతుంది. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఇంటికి వెళ్లే రోడ్డులోకి భారీ కంటెయినర్లు యథేచ్ఛగా వచ్చి వెళుతుంటాయి. రోడ్డుపైనే వాహనాన్ని ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కనే సిమెంట్, ఐరన్‌లోడుతో వచ్చే భారీ వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటాయి. జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. సమీపంలోనే ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుంటారు. అదేవిధంగా గురుద్వారా జంక్షన్ నుంచి శాంతిపురం వెళ్లే రోడ్డులో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉండడంతో కంటెయినర్లు ఏ సమయంలో పడితే ఆ సమయంలో వచ్చివెళుతుంటాయి.భవన నిర్మాణ సామగ్రి రవాణా చేసే వాహనాల యజమానులు, బిల్డర్లు, వ్యాపారులతో కొంతమంది ట్రాఫిక్ అధికారులకు సత్సంబంధాలు ఉన్నాయి. దాంతో వారి వాహనాలు నచ్చిన సమయంలో నగరంలోకి ప్రవేశించి సరకు అన్‌లోడింగ్ చేసి తిరిగి వెళుతుంటాయి. డాబాగార్డెన్స్, వన్‌టౌన్‌లోని వివిధ మార్కెట్ల పరిసరాల్లో కూడా నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తుంటుంది. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకూ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. ఆ సమయంలో జాతీయ రహదారిపై ఉన్న ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలు భారీగా బారులు తీరిపోయి ఉంటాయి. కొన్నిచోట్ల అయితే రెండు, మూడుసార్లు సిగ్నల్ పడిన తర్వాత గానీ జంక్షన్‌ను దాటే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో కూడా నగరంలోని అంతర్గత రోడ్లలో భారీ వాహనాలు రాకపోకలు సాగుతుండడం అన్ని వర్గాలవారికి ఇబ్బందిగా ఉంటోంది. వీటన్నింటిపై ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ఎందుచేతనో చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు.

నిషేధిత వేళల్లో ప్రవేశిస్తే చర్యలు

నగరంలోకి నిషేధిత వేళల్లో భారీ వాహనాలు ప్రవేశించడం నేరం. అలా ఎక్కడైనా భారీ వాహనాలు ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలోకి రాత్రి పది నుంచి ఉదయం ఏడు గంటలు వరకు మాత్రమే భారీ వాహనాలను అనుమతిస్తున్నాం. తర్వాత భారీ వాహనాలు రాకుండా నూటికి నూరుశాతం అడ్డుకుంటున్నాం. ఒకటో అరా ఎక్కడైనా భారీ వాహనాలు వస్తే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

15 మాస్టర్ ప్లాన్ రహదారులు అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

గండిగుండం నుంచి విజయనగరం జిల్లా చింతలపాలెం (అరకు రోడ్డు) వరకూ ప్రస్తుతం ఉన్న రహదారిని 80 అడుగులకు విస్తరించడానికి 6.4 కి.మీ.కు రూ.40.09 కోట్లు ఖర్చు చేయనున్నారు.

» భోగాపురం మండలం మోపాడ నుంచి సవరవల్లి వరకూ 100 అడుగుల మేర 6.3 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.37.8 కోట్లు ఖర్చు చేస్తారు.

» విజయనగరం జిల్లా బొడ్డవలసలో అయినాడ జంక్షన్ నుంచి విజయనగరం రింగ్ రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 80 అడుగులకు విస్తరించడానికి రూ.32.5 కోట్లు అవసరమని అంచనా వేశారు.

ప్రాధాన్యం ప్రకారం పనులు

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే జాతీయ రహదారి, భీమిలి బీచ్ కారిడార్‌లో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశాం. వీటిని దశల వారీగా జీవీఎంసీతో కలిసి నిర్మిస్తాం. అన్ని శాఖ సహకారం తీసుకుంటాం.

భవానీ శంకర్, సీఈ, వీఎంఆర్‌డీఏ

మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

దేవి హోమ్స్ ఎదురుగా గల ఇరుకు రోడ్డులో సుమారు 500 గజాల స్థలంలో భారీ భవనం నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్డులో 600 గజాలలోపు స్థలాల్లో ముందు పది అడుగులు, మిగతా మూడు వైపులా ఆరున్నర అడుగులు మేర సెట్ బ్యాక్స్ విడిచిపెట్టి నిర్మాణం చేపట్టాలి. అదే చిన్న రోడ్డు అయితే ముందు ఇంకా ఎక్కువ స్థలం వదలాల్సి ఉంటుంది. దేవీ హోమ్స్ ఎదురుగా గల రహదారిలో నిర్మాణదారుడు ఒక్క అడుగు సెట్ బ్యాక్ కూడా వదలకుండా నిర్మాణం చేస్తున్నారు. అలాగే బహుళ అంతస్థుల భవనాల చుట్టూ కచ్చితంగా వాహనం తిరిగేంత స్థలం విడిచిపెట్టాలి. పొరపాటున అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ ఇంజన్ తిరగడానికి, నివాసులకు రక్షించేందుకు ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్లాన్ మంజూరుచేస్తారు. అయితే సదరు నిర్మాణదారుడు ఇవేమీ పట్టించుకోకుండా స్థలం మొత్తంలో భవనాన్ని నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారుడు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ నిర్మాణానికి కూతవేటు దూరంలోనే సచివాలయం ఉంది. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి అక్రమ నిర్మాణాలను గుర్తించి అధికారుల దృష్టిలో పెట్టాలి. స్థానిక వైసీపీ నాయకుడి అండతోనే స్థల యజమాని దర్జాగా అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అందుకే సచివాలయ సిబ్బంది చూసీచూడనట్టు ఊరుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా జీవీఎంసీ ప్లాన్ కాపీ జెరాక్స్ నిర్మాణం వద్ద ప్రదర్శించాలి. అటువంటిదేమీ లేకుండా నిర్మాణం చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

సికింద్రాబాద్-లక్నో మధ్య ప్రత్యేక రైలు

... 5వ పేజీ తరువాయి

చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07083 నంబరు గల రైలు ఈ నెల 18, 25 తేదీల్లో (సోమవారం) ఉదయం 9.50 గంటలకు లక్నోలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 1.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 1.32 గంటలకు బయలుదేరి అదేరోజు (బుధవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, విజయవాడ, భువనేశ్వర్, వారణాసి, అయోధ్య మీదుగా రాకపోకలు సాగిస్తాయి.


సాయి నామాన్ని జపిస్తున్న భక్తులు

24 గంటల ఏకధాటి సాయి నామ జపం ప్రారంభం

అగనంపూడి, నవంబరు 14: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని 24 గంటల పాటు సాగే ఏకధాటి సాయి నామ జపం కార్యక్రమాన్ని గురువారం ఉదయం షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలుత సాయినాథున్ని ప్రత్యేక వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు జరిపాక ఏకధాటి సాయి నామ జపానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సేవా సమితి అధ్యక్షుడు కొయ్యా వెంకటరమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వ్యాసశర్మ, శంభుడు, సత్యశ్రీదేవి, లీలావతి, పంకజ, రాజు, పద్మ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు చేయూత

వేపగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేపగుంట వరలక్ష్మీనగర్‌లో ఉన్న గ్రేస్ అనాథ శరణాలయం విద్యార్థుల కోసం బీఎస్ఆర్ యువసేన సభ్యులు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఆర్ యువసేన నాయకుడు మామిడి కిరణ్, టీడీపీ నాయకులు జి.సూరిబాబు, శ్రీను, రాజారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యకర్తలకు భరోసా అని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. శనివాడ వేపచెట్టు జంక్షన్ వద్ద గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో నాయకులు గల్లా రాజు, కరణం పైడి రాజు, జగదీశ్, సత్యారావు, జి.కనకభవాని, ఎం.వెంకటరావు, ఎస్.సింహాచలం, వెంకటరావు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి దుర్గవానిపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు ములకలపల్లి పెంటయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాలను ఆయన స్థానికులకు వివరించారు. నాయకులు మొల్లి అప్పారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆట స్థలం

పెందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆట స్థలాన్ని ఏర్పాటు చేశారు. గీతం ప్రొఫెసర్ రవికిషోర్ భగవతులు, రెడ్డి భావన సౌజన్యంతో గ్రామ యువకుల సహకారంతో అభివృద్ధి చేసిన ఈ ఆట స్థలాన్ని సర్పంచ్ గొర్లె రామకృష్ణ, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ సంయుక్తంగా గురువారం ప్రారంభించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 36, క్యారెట్ 56 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటి కాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 42, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 50, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214


గోపాలపట్నం గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసిన దృశ్యం


మల్కాపురం శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గీతాల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజ్ఞాన నిలయాలు గ్రంథాలయాలు

» జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో పలువురు ప్రముఖులు

గాజువాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం పలుచోట్ల ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని అభివర్ణించారు. ఇందులో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన కేంద్రాలని పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగే వేడుకల్లో పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, సాహిత్య సుధ వ్యవస్థాపకులు అద్దంచి రాఘవచార్యులు, పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన నిలయాలైన లైబ్రరీలలో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటున్నాయని, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి పీవీ రమణ, టీడీపీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


పెందుర్తి లైబ్రరీ ప్రాంగణంలో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న శరగడం చినఅప్పలనాయుడు, తదితరులు

గోపాలపట్నం: గ్రంథాలయంలో విద్యార్థులు, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు కావాల్సిన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని, అందువల్ల అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రంథాలయాధికారి ఎస్వీ నరసింహం కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. తొలుత జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.సోములు, చందు సుబ్బారావు, సోడదాసి సుధాకర్‌తో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞాన వంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ములగాడ ఎంఈవో త్రినాథ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లా డారు. పఠనాసక్తి అందరిలో పెంపొందాల న్నారు. విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో షిప్‌యార్డు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు, న్యాయవాది కేవీ రాజు, రచయిత సత్తిరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, ఎస్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక లైబ్రరీ ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహానికి డీఆర్‌సీ మాల్ అధినేత దాడి రమణచిట్టి పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శరగడం నర్సింహమూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు పెతకంశెట్టి భూలోక, కార్యదర్శి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సినీనటి శ్రీరెడ్డిపై కేసులు నమోదు

» పోసాని కృష్ణమురళీపై కూడా కేసు నమోదు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీ నటి శ్రీరెడ్డిపై విశాఖ నగరంలోని టూటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత పట్ల అనుచితవ్యాఖ్యలు చేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళ నాయకులు గనగళ్ల సత్య, భాగ్యలక్ష్మి, సత్యవతి, లీలా తదితరులు గురువారం టూటౌన్ సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా క్రైం నంబర్ 282/2024తో కేసు నమోదు చేసినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా తెలుగు మహిళల ఫిర్యాదు మేరకు శ్రీరెడ్డిపై కేసు నమోదుచేశారు.

మరో సినీనటుడు పోసాని కృష్ణమురళీపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌లపై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసినందున చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నేత గండి బాబ్జీ చేసిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

పోస్టు కార్డుల ఉద్యమంలో భాగస్వాములు కావాలి

సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పోస్టు కార్డుల ఉద్యమంలో భాగస్వాములు కావాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ప్లాంటులో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం 1,373 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఉక్కు ఉద్యోగులు, కార్మికులందరూ పోస్టు కార్డును పీఎంకు పంపాలన్నారు. పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడంతో పాటు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, టీవీకే రాజు, అప్పారావు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ధరలు తగ్గించాలంటూ సీపీఎం ఆందోళన

పెదగంట్యాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల ధరలతో పాటు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ దరువును మోపడం దారుణమని మండిపడ్డారు. ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని.. సంబంధిత కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారించి నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చూడాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ నినాదాలు చేశారు. డిమాండ్ అనంతరం తహసీలారుకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.గురప్ప, డి.వెంకటరావు, కణితి అప్పలరాజు, పాల అప్పలరెడ్డి, యు.సోమేశ్, ఈవీ రమణ, కేవీ చారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: నిత్యావసర వస్తువుల ధరలు, పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. బుచ్చిరాజుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి పాలకులు రూ.వేల కోట్లు వసూలు చేయడాన్ని ఆక్షేపించారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, అప్పారావు, పి.అనుసూయ, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మల్కాపురం: సర్దుబాటు విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై భారం వేయడం తగదని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ పారిశ్రామిక ప్రాంత సీపీఎం నాయకులు ములగాడ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, కార్యదర్శి పైడిరాజులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా వేధించిందో దానికి మించి కూటమి ప్రభుత్వం ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. స్థల ఆధారిత పన్నును రద్దు చేయాలని, జమిలి ఎన్నికలను నిర్వహించరాదని, నిరుద్యోగ భృతి చెల్లించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్ష్మణమూర్తి, బూడి శ్రీను, కె.రమణ, ఎన్.శ్రీను, ఎ.సత్యారావు, ఆర్.విమల, వై.కల్యాణి, మమత తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద..

ప్రభుత్వ రంగ సంస్థల ప్రదాత జవహర్‌లాల్ నెహ్రూ

అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించి దేశ ప్రగతికి పునాది వేసిన మహనీయుడు జవహర్‌లాల్ నెహ్రూ అని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ నెహ్రూ పార్కులో గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఉక్కు యాజమాన్యం అపహస్యం చేస్తూ అవమానిస్తుందని ఆరోపించారు. దేశంలో సుమారు మూడు వందల ప్రభుత్వ రంగ సంస్థలను నెహ్రూ నెలకొల్పారన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, మసేన్‌రావు, బోసుబాబు, బీఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ స్ఫూర్తితో ఉక్కును కాపాడుకుందాం

కూర్మన్నపాలెం: చాచా నెహ్రూ స్ఫూర్తితో ఐక్య పోరాటాలు చేసి ప్రజా సంపదైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరం వద్ద నెహ్రూ ఫ్లెక్సీకి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వరంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారన్నారు. నెహ్రూ స్ఫూర్తితో కార్మికులందరూ పట్టువీడకుండా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, రాజు, కారు రమణ, ప్రసాద్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, తదితరులు

జనసైనికునికి ఆర్థిక సాయం

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనసైనికుడు నక్కా ఆనంద్ కుటుంబానికి జనసేన పార్టీ స్థానిక శ్రేణులు అండగా నిలిచారు. జనసైనికులు, వీరమహిళలు సేకరించిన రూ.50 వేలను కేఎస్ఎన్ రెడ్డి నగర్‌లో నివాసముంటున్న బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ నేతలు కోన తాతారావు, విందుల వెంకటరమణల చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ 79వ వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, నాయకులు దాసరి శ్రీను, నక్కా చినదేముడు, రమణ, కుమార్, కృష్ణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


ఓడ నిర్మాణ పనులకు ముందు పూజ చేస్తున్న పీఏడీఎం అధికారి బి.శివకుమార్

ఫ్లీట్ సపోర్టు ఓడ నిర్మాణానికి కీల్‌లెయింగ్

హెచ్ఎస్ఎల్‌లో మైలురాయి

మల్కాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)లో ఫ్లీట్ సపోర్టు ఓడ నిర్మాణ పనులకు ఇండియన్ నేవీ కంట్రోలర్ వార్ షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విజిషన్ అధికారి పీఏడీఎం అధికారి బి.శివకుమార్ గురువారం కీల్ లేయింగ్ చేశారు. దీంతో షిప్‌యార్డు ఓ ముఖ్యమైన మైలురాయిని దాటినట్టు అధికారులు భావిస్తున్నారు. ఇండియన్ నేవీ నుంచి ఆర్డర్ పొందిన ఈ వెసెల్‌ను షిప్‌యార్డులో గల బిల్డింగ్ డాక్‌లో నిర్మించనున్నారు. షిప్‌యార్డుకు ఆధునిక యుద్ధనౌకలను నిర్మించడంలో సామర్థ్యం ఉందని భారత నౌకాదళం విశ్వసించి ఈ ఆర్డర్ ఇచ్చింది. హెచ్ఎస్ఎల్ నిర్మాణంలో 44000 టన్నుల ఫ్లీట్ సపోర్టు ఓడ 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న మొట్టమొదటిది. ఇది సముద్రంలో ఇంధనం, నీరు, మందుగుండు సామగ్రి నింపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 2010లో రక్షణ మంత్రిత్వ శాఖలో విలీనం అయినప్పటి నుంచి షిప్‌యార్డుకు కీల్ లెయింగ్ ఒక కల. ఇప్పుడు సాకారం కావడంతో హెచ్ఎస్ఎల్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.


జీఎం సుబ్రహ్మణ్యానికి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

భెల్ హెచ్‌పీవీపీ జీఎంగా సుబ్రహ్మణ్యం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ నూతన జనరల్ మేనేజర్‌గా జి.సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. హైదరాబాద్ హెచ్‌పీవీపీ యూనిట్ నుంచి బదిలీపై వచ్చిన ఇక్కడకు వచ్చిన ఆయనకు గుర్తింపు, ప్రోగ్రెసివ్ ఫ్రంట్ కార్మిక సంఘ నాయకులు గురువారం ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో నెలకొన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పీవీఎస్ రాజు, బొండా బాబూరావు, కొల్లి దేముడు, రవీంద్రబాబు, టి.భాస్కరరావు, జీటీపీ ప్రకాశ్, ఉరుకూటి బాబూరావు, నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కుడో పోటీల విజేతలకు సత్కారం


విజేతలతో కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సమాజంలో గౌరవంతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్, రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు కరణం రెడ్డి నరసింగరావు అన్నారు. జాతీయ స్థాయి కుడో పోటీల విజేతలను గురువారం స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ కార్యాలయంలో ఆయన సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మరక్షణ కూడా లభిస్తుందన్నారు. క్రీడాకారులకు విద్య, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, మూడు శాతం రిజర్వేషన్ కూడా ఉందన్నారు. రాష్ట్ర కుడో సంఘం అధ్యక్షుడు ఎ.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, నాగేశ్వరరావు, క్రీడా ప్రతినిధులు బొత్స దిలీప్‌కుమార్, జగదీశ్, కృష్ణారెడ్డి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం

ఆటోనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవం పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు విద్యార్థులు ప్రత్యేక వస్త్రధారణతో పాల్గొని సందడి చేశారు. 87వ వార్డు కణితి హైస్కూల్, 70 వార్డు శ్రీనివాసనగర్ ట్వింకిల్ స్కూల్, శ్రీసాయి విద్యానికేతన్‌తో పాటు పలు పాఠశాలల్లో చాచా నెహ్రూ జయంతికి నివాళులర్పించారు. క్రీడలు, చిత్రలేఖనం పోటీలు, నెహ్రూ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు దొడ్డి శ్యామ్, కరుణకుమారి, పి.వాసుదేవరావు, లలితకుమారి, బి.సూర్యప్రకాశ్, నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. 71 వార్డు ఆటోనగర్ సమీపం తోకాడలో ఎస్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోపాలపట్నం: స్థానిక లక్ష్మీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవంలో గోపాలపట్నం ఎంఈవో-2 డి.దివాకర్ పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పాఠ్యాంశాల బోధన, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఏఎంపీ-2 పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎం.మోహనరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొని మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బెల్సి జోస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సరిపల్లి, పెందుర్తి, పెందుర్తి-2, ఐఈఎఫ్ ఫీడర్లలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పెందుర్తి, ఎల్ఐసీ కాలనీ, అనకాపల్లి రోడ్డు, ఆనందపురం రోడ్డు, కొత్తవలస రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. సుజాతనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెందుర్తి పాత ఆస్పత్రి, పెందుర్తి పోలీసు స్టేషన్, క్రాంతినగర్, చాణక్యనగర్, ఇంద్రాణి ఫంక్షన్ హాల్. చినముషిడివాడ మెయిన్ రోడ్డు, 80 అడుగుల రోడ్డు, టీసీ కాలనీ. శివ గాయిత్రీనగర్ ప్రాంతాల్లో సరఫరాకు ఆటంకం కలుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు.

కళింగ కార్పొరేషన్ సభ్యునిగా పొన్నాడ రమణ



గోపాలపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కళింగ కార్పొరేషన్ సభ్యుడిగా గ్రేటర్ విశాఖ 89వ వార్డు ఖారవేలనగర్‌కు చెందిన పొన్నాడ రమణ నియమితులయ్యారు. కళింగ కార్పొరేషన్ సభ్యుడిగా తనను నియమించడం పట్ల రమణ ఆనందం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటివ్ సభ్యునిగా ఈశ్వర్



కూర్మన్నపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటివ్ సభ్యునిగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్‌ను నియమిస్తూ రైల్వే డీజీఎం కౌషలేంద్ర కె.ఖదంగ ఉత్తర్వులు జారీ చేశారు. దువ్వాడ స్టేషన్ డీ-గ్రేడ్ నుంచి ఏ-గ్రేడ్‌ను సొంతం చేసుకోవడంలో, ఇతర సేవలను గుర్తించి ఆయనను రైల్వే కన్సల్టేటివ్ సభ్యునిగా నియమించారు.

జర్వాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా జర్వాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత సూచించారు. 85వ వార్డు పరిధి దానబోయినపాలెం, తలారివానిపాలెం, పెద్దినాయుడుపాలెం గ్రామాల్లో జర్వాల విజృంభించిన క్రమంలో గురువారం దిబ్బపాలెంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు వైద్య సేవలందించి, మందులు అందజేశారు.

విమ్స్‌లో ఉద్యోగాలంటూ నకిలీ నియామక పత్రాలతో మోసం

పోలీసుల అదుపులో ఇద్దరు బాధిత మహిళలు

నిందితుడు అల్లిపురానికి చెందిన వ్యక్తి

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నకిలీ నియామక పత్రాలతో 'విమ్స్'కు వచ్చి సీనియర్ అసిస్టెంట్లుగా చేర్చుకోవాలంటూ కోరిన ఇద్దరు మహిళలను ఆరిలోవ పోలీసులకు అప్పగించినట్టు ఆస్పత్రి డైరెక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈ నెల 12న ఇద్దరు మహిళలు వచ్చి తమకు విమ్స్‌లో ఉద్యోగాలు వచ్చాయని, విధుల్లో చేర్చుకోవాలని కోరుతూ నియామక పత్రాలు చూపించారని తెలిపారు. అయితే వాటిని పరిశీలిస్తే.. అవి నకిలీవిగా తేలినట్టు వెల్లడించారు. గతంలో విమ్స్ డైరెక్టర్‌గా పని చేసిన సత్యవరప్రసాద్ సంతకం చేసినట్టు ఉందని, అయితే ఆ పత్రాలు నకిలీవని తెలిపారు. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్టు డాక్టర్ రాంబాబు చెప్పారు. వీరిద్దరికీ నగరంలోని అల్లిపురంలో ఉంటున్న వంశీ అనే వ్యక్తి ఒకరి నుంచి రూ.1.2 లక్షలు, మరొకరి వద్ద రూ.2 లక్షలు చొప్పున తీసుకొని నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చినట్టు తెలిసిందన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ఏసీ వైర్ల నుంచి రాలిన నిప్పురవ్వలతో ఆక్సిజన్ టవర్స్‌లో అగ్నిప్రమాదం

సీతమ్మధార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ల నుంచి నిప్పురవ్వలు దీపావళి బాణసంచాపై పడడంతో సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. 32వ అంతస్తులోని ఒక ఇంటిలో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఆ ఇంటిలో అద్దెకు ఉంటున్న శ్రీనివాస్ అనే వ్యక్తి కుమారుడు ఏసీ ఆన్ చేసి నిద్రపోతున్నాడు. ఏసీ చాలా సమయం పాటు వేసి ఉన్నప్పటికీ పనిచేయకపోగా, దానికి సంబంధించిన విద్యుత్ వైర్ల నుంచి నిప్పు రవ్వలు రాలాయి. ఇవి ఇంటిలో ఉన్న దీపావళి బాణసంచాపై పడటంతో మంటలు వ్యాపించాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంటిలో నిద్రపోతున్న శ్రీనివాస్ కుమారుడు కార్తిక్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం తప్ప ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

శ్రీరెడ్డిపై తెలుగు మహిళల ఫిర్యాదు


ఫిర్యాదు అందజేస్తున్న మహిళలు

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని టూటౌన్ పోలీసు స్టేషన్లో తెలుగు మహిళలు సినీనటి శ్రీరెడ్డిపై గురువారం ఫిర్యాదు చేశారు, సోషల్ మీడియాలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టింగ్‌లు పెట్టడంపై వారు అభ్యంతరం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. తెలుగు మహిళా కార్యదర్శి గనగళ్ల సత్యవతి, భాగ్యలక్ష్మి, లీల, సత్యవతి, పిన్నింటి మధులక్ష్మి, ధనలక్ష్మి, సుగుణ, సూర్యనారాయణ, కమలప్రియ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి కొనుగోళ్ల సందడి

పూర్ణామార్కెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పూర్ణామార్కెట్ గురువారం కొనుగోలుదారులతో సందడిగా కనిపించింది. పూజాసామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. పౌర్ణమి పూజలో వినియోగించే అరటి పండ్లు, కొబ్బరి కాయలు, పండ్లు, పూలు, తమల పాకుల ధరలు రెండింతలు పెరిగాయి. పూజలో వినియోగించే పత్రి, మామిడి ఆకులు, ఉసిరికి డిమాండ్ పెరిగింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి.

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను, ఎస్ఐ కె.శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందితే ప్రమాదాల నియంత్రణకు దోహదపడవచ్చని తూర్పు ట్రాఫిక్ రెండో సీఐ ఎం.శ్రీను, టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ ప్రియాంక విద్యోదయ పాఠశాలలో ట్రాఫిక్ నియామాలు, నియంత్రణ, రహదారులపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. రోడ్డు మధ్యలో నడవరాదని, రహదారులపై ప్రయాణ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ సమస్యలపై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్‌గా డైరెక్టర్‌గా ఈతలపాక సుజాత



కంచరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :కంచరపాలెం జీవీఎంసీ 55వ వార్డు టీడీపీ సీనియర్ నాయకురాలు ఈతలపాక సుజాతను మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సుజాత ప్రస్తుతం రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధిగా ఉన్నారు. తనను డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారాలోకేశ్, వర్లరామయ్య, హోం మంత్రి అనిత, పల్లా శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎంపీ భరత్, గండి బాబ్జి, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా సుజాతకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బాలలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న హనుమంతు ప్రభాకర్

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ మంచి పేరు పొందాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ పైడపునాయుడుతో కలిసి నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల్య జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలన్నారు. పోటీల్లో విజేతలను అభినందించారు.

అర్ధరాత్రి డివైడర్ ఏర్పాటు ఎవరిపని?

సీతమ్మధార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తప్పుడు మార్గంలో వెళ్లకుండా, అందరు నడవడానికి వీలుగా జీవీఎంసీ అధికారులు రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో నక్కవానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు సక్రమ మార్గంలో ప్రయాణించేవారు. ఇంత ముఖ్యమైన రహదారిలో అర్ధరాత్రి దాటాక రహదారికి అడ్డంగా విభాజకాన్ని (డివైడర్) ఏర్పాటు చేశారు. మూడు రోజులు అలాగే ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు రోజుల తర్వాత మరోసారి అర్ధరాత్రి వేళ రహదారి ప్రారంభానికి ముందు డివైడర్ కొత్తగా వెలిసింది. దీంతో స్థానికులు విస్తుపోయారు. ఎందుకు, ఎవరి కోసం వేశారో ఎవరికీ తెలియలేదు. ఇది ఎవరి పని? అన్న ఆలోచనలో పడ్డారు. రాత్రికి రాత్రికి డివైడర్లు ఏర్పాటుకు కారణం నక్కవానిపాలెం ఆరంభంలో వైన్ షాపు ఉండటమే కారణంగా గ్రహించారు. ప్రైవేట్ వ్యక్తులు తమకు కావలసిన విధంగా డివైడర్లు వేశారని తెలుసుకున్నారు. అధికారుల సహకారం లేకుండా ఇది జరిగే పనేనా? అని సంశయిస్తున్నారు. యూనియన్ బ్యాంక్, సీతమ్మధార రైతు బజార్‌కు వెళ్లేందుకు ఇదే రహదారి కావడంతో డివైడర్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్

ఎవరికీ పట్టదా?

నక్కవానిపాలెం ప్రారంభానికి ముందు జనావాసాలు ఉండేచోట మద్యం దుకాణం ఉంది. ఆ పరిసరాల్లోనే ఆలయాలు ఉన్నాయి. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, ఓ మిషనరీ స్కూల్ ఉండటంతో జీవీఎంసీ అధికారుల సహకారంతో రాత్రికి రాత్రి డివైడర్ ఏర్పాటు చేశారని స్థానికులు చెప్పుకొంటున్నారు. రెండు రోజులుగా మద్యం దుకాణం మూసి ఉంచినా, డివైడర్‌ను తొలగించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డివైడర్‌ను రహదారికి అడ్డంగా పెట్టడంతో వాహనాలు తప్పుడు మార్గంలో వెళ్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు సైతం పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాన్ని ఇక్కడ నుంచి వేరొకచోటకు తరలించి, డివైడర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

భారీ వాహనాల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలు చోటుచేసుకోవడం జరుగుతుంది. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఇంటికి వెళ్లే రోడ్డులోకి భారీ కంటెయినర్లు యథేచ్ఛగా వచ్చి వెళుతుంటాయి. రోడ్డుపైనే వాహనాన్ని ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కనే సిమెంట్, ఐరన్‌లోడుతో వచ్చే భారీ వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటాయి. జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. సమీపంలోనే ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుంటారు. అదేవిధంగా గురుద్వారా జంక్షన్ నుంచి శాంతిపురం వెళ్లే రోడ్డులో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉండడంతో కంటెయినర్లు ఏ సమయంలో పడితే ఆ సమయంలో వచ్చివెళుతుంటాయి. భవన నిర్మాణ సామగ్రి రవాణా చేసే వాహనాల యజమానులు, బిల్డర్లు, వ్యాపారులతో కొంతమంది ట్రాఫిక్ అధికారులకు సత్సంబంధాలు ఉన్నాయి. దాంతో వారి వాహనాలు నచ్చిన సమయంలో నగరంలోకి ప్రవేశించి సరకు అన్‌లోడింగ్ చేసి తిరిగి వెళుతుంటాయి. డాబాగార్డెన్స్, వన్‌టౌన్‌లోని వివిధ మార్కెట్ల పరిసరాల్లో కూడా నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తుంటుంది. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకూ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. ఆ సమయంలో జాతీయ రహదారిపై ఉన్న ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలు భారీగా బారులు తీరిపోయి ఉంటాయి. కొన్నిచోట్ల అయితే రెండు, మూడుసార్లు సిగ్నల్ పడిన తర్వాత గానీ జంక్షన్‌ను దాటే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో కూడా నగరంలోని అంతర్గత రోడ్లలో భారీ వాహనాలు రాకపోకలు సాగుతుండడం అన్ని వర్గాలవారికి ఇబ్బందిగా ఉంటోంది. వీటన్నింటిపై ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు.

నిషేధిత వేళల్లో ప్రవేశిస్తే చర్యలు

నగరంలోకి నిషేధిత వేళల్లో భారీ వాహనాలు ప్రవేశించడం నేరం. అలా ఎక్కడైనా భారీ వాహనాలు ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలోకి రాత్రి పది నుంచి ఉదయం ఏడు గంటలు వరకు మాత్రమే భారీ వాహనాలను అనుమతిస్తున్నాం. తర్వాత భారీ వాహనాలు రాకుండా నూటికి నూరుశాతం అడ్డుకుంటున్నాం. ఒకటో అరా ఎక్కడైనా భారీ వాహనాలు వస్తే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

-ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస, కిరండోల్ (కేకే) లైనులో జగదల్‌పూర్ సమీపంలోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) స్టీల్ లిమిటెడ్‌లో నాగర్నార్ రైల్వే సైడింగ్ కోసం కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఓవర్ హెడ్ 25 కేవీ ఏసీ విద్యుత్ సరఫరా, సబ్ సెక్షన్ ఎలక్ట్రికల్ ట్రాక్షన్‌ను గురువారం డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌తోపాటు ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తన్మయ్ ముఖోపాధ్యాయ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్‌కు ప్రధాన లాజిస్టిక్ ప్రొవైడర్‌గా వాల్తేరు డివిజన్ నిలుస్తోందన్నారు. ఎలక్ట్రికల్ ట్రాక్షన్ అందుబాటులోకి రావడం ద్వారా గత ఏడాది అక్టోబరులో కార్యకలాపాలు ప్రారంభించిన నాగర్నార్ స్టీల్‌ప్లాంట్‌లో ఎక్కువ రేక్‌లను నడపడం ద్వారా ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం శివానందప్రసాద్, ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్ అధికారులు, నాగర్నార్ ప్లాంట్ ప్రతినిధులు, వాల్తేరు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

మన దేశానిది పటిష్ట ఆర్థిక వ్యవస్థ


సహకార జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా సహకార శాఖాధికారి టి ప్రవీణ

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే పటిష్ట ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్‌కు గుర్తింపు ఉందని జిల్లా సహకార శాఖాధికారి టి.ప్రవీణ అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మర్రిపాలెం కార్యాలయంలో నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆమె పాల్గొని సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ఆర్థికవృద్ధి సాధనకు కృషి జరుగుతోందన్నారు. బ్యాంక్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ మాట్లాడుతూ కేంద్రస్థాయిలో సహకార మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి, అన్ని సహకార సంఘాలను కంప్యూటరీకరించడం ద్వారా సహకార సంస్థల వ్యాపారాన్ని సులభతరం చేస్తారన్నారు. బ్యాంక్ జీఎం బి శ్రీనివాసరావు, డీజీఎం ఎం.అశోక్‌కుమార్, ఏజీఎం ఎం.శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

గండిగుండం నుంచి విజయనగరం జిల్లా చింతలపాలెం (అరకు రోడ్డు) వరకూ ప్రస్తుతం ఉన్న రహదారిని 80 అడుగులకు విస్తరించడానికి 6.4 కి.మీ.కు రూ.40.09 కోట్లు ఖర్చు చేయనున్నారు. భోగాపురం మండలం మోపాడ నుంచి నవరవల్లి వరకూ 100 అడుగుల మేర 6.3 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.37.8 కోట్లు ఖర్చు చేస్తారు. విజయనగరం జిల్లా బొడ్డవలసలో అయినాడ జంక్షన్ నుంచి విజయనగరం రింగ్ రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వరకు 80 అడుగులకు విస్తరించడానికి రూ.32.5 కోట్లు అవసరమని అంచనా వేశారు.

ప్రాధాన్యం ప్రకారం పనులు

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే జాతీయ రహదారి, భీమిలి బీచ్ కారిడార్‌లో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశాం. వీటిని దశల వారీగా జీవీఎంసీతో కలిసి నిర్మిస్తాం. అన్ని శాఖ సహకారం తీసుకుంటాం.

-భవానీ శంకర్, సీఈ, వీఎంఆర్‌డీఏ

మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

దేవి హోమ్స్ ఎదురుగా గల ఇరుకు రోడ్డులో సుమారు 500 గజాల స్థలంలో భారీ భవనం నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్డులో 600 గజాలలోపు స్థలాల్లో ముందు పది అడుగులు, మిగతా మూడు వైపులా ఆరున్నర అడుగులు మేర సెట్ బ్యాక్స్ విడిచిపెట్టి నిర్మాణం చేపట్టాలి. అదే చిన్న రోడ్డు అయితే ముందు ఇంకా ఎక్కువ స్థలం వదలాల్సి ఉంటుంది. దేవీ హోమ్స్ ఎదురుగా గల రహదారిలో నిర్మాణదారుడు ఒక్క అడుగు సెట్ బ్యాక్ కూడా వదలకుండా నిర్మాణం చేస్తున్నారు. అలాగే బహుళ అంతస్తుల భవనాల చుట్టూ కచ్చితంగా వాహనం తిరిగేంత స్థలం విడిచిపెట్టాలి. పొరపాటున అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ ఇంజన్ తిరగడానికి, నివాసులకు రక్షించేందుకు ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్లాన్ మంజూరుచేస్తారు. అయితే సదరు నిర్మాణదారుడు ఇవేమీ పట్టించుకోకుండా స్థలం మొత్తంలో భవనాన్ని నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారుడు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ నిర్మాణానికి కూతవేటు దూరంలోనే సచివాలయం ఉంది. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి అక్రమ నిర్మాణాలను గుర్తించి అధికారుల దృష్టిలో పెట్టాలి. స్థానిక వైసీపీ నాయకుడి అండతోనే స్థల యజమాని దర్జాగా అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అందుకే సచివాలయ సిబ్బంది చూసీచూడనట్లు ఊరుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా జీవీఎంసీ ప్లాన్ కాపీ జెరాక్స్ నిర్మాణం వద్ద ప్రదర్శించాలి. అటువంటిదేమీ లేకుండా నిర్మాణం చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో నర్సింగ్ విద్యార్థినికి తీవ్రగాయాలు

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తూ విద్యుత్ తీగలు తగిలి నర్సింగ్ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి సంగం శరత్ సినిమా థియేటర్ వెనుక గల సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్‌లో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన స్నేహదాస్ (20) పది నెలల క్రితం చేరింది. ఆమెకు సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్తిక్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ నెల 12న అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో స్నేహదాస్ తన స్నేహితుడు సుశాంత్‌కు ఫోను చేసి స్కూల్ వద్దకు రమ్మంది. దీంతో కార్తిక్ అక్కడకు బిరియానీ ప్యాకెట్‌తో వచ్చాడు. మూడో అంతస్తులో ఉంటున్న స్నేహదాస్, స్నేహితురాలు సాహేలితో కలిసి చప్పుడు చేయకుండా కిందికి దిగింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న అద్దాల కిటికీ నుంచి బయటకు దూకింది. స్కూల్ ప్రహరీ నుంచి బయటకు వెళ్లేందుకు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ ఎక్కడానికి ప్రయత్నించింది. ఈ తరుణంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి ఉన్న తీగలు తగిలి షాక్ తగిలి కింద పడిపోయింది. దీంతో పెద్ద శబ్దం వచ్చి మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు, లోపల పడుకుని ఉన్న మేట్రన్ సత్యవతి బయటకు వచ్చి చూసేసరికి స్నేహదాస్ కిందిపడి కాలిపోయి ఉంది. గాయపడిన ఆమెను సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కుడి వైపు మొత్తం శరీరం కాలింది. ప్రిన్సిపాల్ జి.గౌరి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ జి.గౌరిని వివరణ కోరగా స్నేహదాస్ ప్రవర్తన సరిగా లేదని, అక్టోబరులో ఫిర్యాదు చేశామని తెలిపారు.


సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్‌లో విద్యార్థిని దూకిన కిటికీ

సదరం... గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ప్రతి నెలా స్లాట్ బుకింగ్ సమయం ఇచ్చేవారు. ఇటీవల రెండు నెలలకు ఒకేసారి స్లాట్లు ఇస్తున్నారు. అక్టోబరు, నవంబరు నెలల స్లాట్లు అక్టోబరులోనే ఇచ్చేశారు. అయితే ఈఎన్‌టీ, తదితర సమస్యలు ఉన్నవారికి సర్టిఫికెట్ల జారీలో పెద్దగా ఇబ్బంది లేదు. ఇతరత్రా సమస్యలు ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల పొరుగునున్న జిల్లాల ఆస్పత్రులకు వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. ఉదాహరణకు విశాఖ జిల్లాలో కేజీహెచ్ కావాలని చాలామంది ఆప్షన్ తీసుకుంటున్నారు. ఆ స్లాట్లు అయిపోగానే పక్కనే ఉన్న అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఏరియా ఆస్పత్రులలో ఖాళీ స్లాట్లు ఉన్నాయని, అక్కడకు వెళ్లవచ్చునని సచివాలయాల సిబ్బంది సూచిస్తున్నారు. సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలనుకునేవారు దూరాభారం అయినా తప్పనిసరై అక్కడకు వెళుతున్నారు. 100 శాతం వైకల్యం కలిగిన వారికి సహాయంగా మరొకరు అంతదూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య పెద్ద జిల్లాల్లో ఎక్కువగా ఉన్నందున దీనికి పరిష్కారం చూపించాల్సి ఉంది.

ఇటీవల డాబాగార్డెన్స్‌కు చెందిన ఓ మహిళ సదరం స్లాట్ కావాలని సచివాలయానికి వెళితే...కేజీహెచ్‌లో లేదని అనకాపల్లి వెళ్లాలని సూచించారు. అలాగే మరికొందరికి పాడేరు, నర్సీపట్నం వెళ్లాల్సిందిగా చెబుతున్నారు. విశాఖలో స్లాట్లు ఖాళీ లేనందునే పక్కనే ఉన్న ఏరియా ఆస్పత్రులను సూచిస్తున్నామని, వారికి ఇష్టం లేకపోతే విశాఖలో స్లాటు దొరికే వరకు వేచి ఉండవచ్చునని, అందులో బలవంతం ఏమీ ఉండదని సిబ్బంది చెబుతున్నారు. దీనికి అధికారులు ఏ విధంగా పరిష్కారం చూపిస్తారో చూడాల్సి ఉంది.

‘ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం’


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నేత జగ్గునాయుడు

సీతమ్మధార, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రిచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. విద్యుత్ ట్రూ అప్, ఇంధన చార్జీలు వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దరలు తగ్గించడం, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం, మహిళలకు రక్షణ, యువతకు ఉపాధి డిమాండ్లతో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వ రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, 16 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేత డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులను తొలగించడానికి మోదీ ప్రభుత్వం పూనుకుంటే కూటమి నాయకులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. విశాఖకు వచ్చిన చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లు రుషికొండ ప్యాలెస్ చుట్టూ తిరిగారే తప్ప స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్ రాజు, వి.నరేంద్ర కుమార్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ పోలీసులు ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు గురువారం అవగాహన కల్పించారు, ఓమ్ని ఆసుపత్రి తన సామాజిక బాధ్యతలో భాగంగా బీచ్ రోడ్డు, మహారాణిపేట, జిల్లా పరిషత్ జంక్షన్, జైల్‌రోడ్డు, రామ్‌నగర్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. యువత ప్రమాదాల్లో నిండు ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని, కుటుంబాలకు వేదన మిగులుస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమే ఇందుకు కారణమన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు, కార్లలో వెళ్లినప్పుడు సీటుబెల్టులు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి వెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని వివరించారు. కొందరికి హెల్త్ చెకప్ కూపన్లు అందజేశారు. ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నైవేద్యానికి నోచుకోని నారాయణుడు!

... 5వ పేజీ తరువాయి

శ్రీకృష్ణదేవరాయలు విజయస్థూపాన్ని ఏర్పాటుచేయగా దానిని, వైకుంఠ నారాయణుని ఆలయాన్ని కలుపుతూ ప్రత్యేక టూరిజం వ్యవస్థను నెలకొలుపుతామంటూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ప్రస్తుత భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. అది కూడా నేటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దాంతో ఆలయాన్ని, విజయస్థూపాన్ని చూసే భాగ్యం భక్తులకు లభించడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్లే మార్గం కూడా చాలావరకు రాళ్లు తేలి ఇబ్బందికరంగా మారింది. దేవదాయ శాఖ అధికారులు ఇప్పటికైనా ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

సికింద్రాబాద్-లక్నో మధ్య ప్రత్యేక రైలు

... 5వ పేజీ తరువాయి

చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07083 నంబరు గల రైలు ఈ నెల 18, 25 తేదీల్లో (సోమవారం) ఉదయం 9.50 గంటలకు లక్నోలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 1.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 1.32 గంటలకు బయలుదేరి అదేరోజు (బుధవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, విజయవాడ, భువనేశ్వర్, వారణాసి, అయోధ్య మీదుగా రాకపోకలు సాగిస్తాయి.



వాగ్దేవి పాఠశాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఉత్సాహంగా బాలల దినోత్సవం

అక్కయ్యపాలెం/అల్లిపురం/డాబాగార్డెన్స్/సీతంపేట/నవంబరు14 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవాన్ని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బాలలు విచిత్ర వేషధారణలు, నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు, అతిథులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోర్టు ఆసుపత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని 27వ వార్డు అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపల్ కమల్‌జిత్ మాట్లాడుతూ ఈతరం పిల్లల పెంపకానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహనతో ఉండాలన్నారు. జిల్లాలో 85 ప్రాంతాల్లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు కన్వీనర్ కె.సుశీల తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్స్ , సీనియర్స్ విభాగాల్లో డ్రాయింగ్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, సీనియర్స్‌కు కబడ్డీ తదితర పోటీలు నిర్వహించామన్నారు. 26వ వార్డు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ హాజరయ్యారు. మహనీయుల ఆశయాలు, ఆలోచనలను విద్యార్థులు అలవరుచుకోవాలని భీమ్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


జనసేన కార్యాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద చిన్నారులు, నాయకులు

☛ సంక్షిప్తంగా..

నేడు డీఎస్సీ శిక్షణ దరఖాస్తుకు తుది గడువు

ఎంవీపీ కాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2024 ఉచిత శిక్షణ పొందగోరే అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉన్న కార్యాలయం వద్దకు నేరుగా వచ్చి దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు. బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్ అర్హత పత్రం, కుల, ఆదాయ, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 94925 69177లో సంప్రదించాలని కోరారు.

కుదుట పడిన విద్యార్థి ఆరోగ్యం

ఆరిలోవ, నవంబరు 14 : శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం విద్యార్థి రవీంద్రకుమార్ ఆరోగ్యం కుదుట పడినట్టు ఉమ్మడి విశాఖ గురుకులం కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి తెలిపారు. గురువారం సదరు విద్యార్థి అస్వస్థతకు గురి కాగా కేజీహెచ్‌కు తలించిన విషయం విదితమే. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం బాగుందని ఆమె చెప్పారు.

కలెక్టర్‌కు నివేదిక

ఆరిలోవ, నవంబరు 14 : కేంద్రకారాగారంలో సమీపంలో గల రెండు ఎకరాల స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుపై ఐవోసీ ప్రతినిధులు, జైలు అధికారులు శ్రీకాకుళం జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. ఈ చర్చలు ఓ కొలిక్కి రావడంతో, దీనిపై రూపొందించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్టు విశాఖ జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ వెల్లడించారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా విజయ్‌బాబు


ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : పరిశోధకుల వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా ఆచార్య ఒమ్మి విజయ్‌బాబు నియమితులయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు విజయ్‌బాబుకు చీఫ్ వార్డెన్‌గా నియామక ఉత్తర్వులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు తన కార్యాలయంలో గురువారం అందజేసి అభినందనలు తెలియజేశారు. పరిశోధకులతో సమన్వయం చేస్తూ హాస్టల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. వర్సిటీ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. శుక్రవారం విజయ్‌బాబు బాధ్యతలు స్వీకరిస్తారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 54 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)55, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 50, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

» డీఈవో ప్రేమ్‌కుమార్


విద్యారులకు బహుమతులను అందజేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక విద్యార్థి దశ నుంచి ఇష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే సత్ఫలితాలు లభిస్తాయని, ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గురువారం చినగదిలి మండలం హనుమంత వాక జంక్షన్‌లో గల మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్యం అపురూపమని, మంచి అభిరుచిని పెంపొందించుకొని చిన్ననాటి విజయాలు సాధించడం అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి బలగ సుధాకర్ అందించిన నోటు పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే తోటగరువు మండల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం విశ్వనాథం ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈపీడీసీఎల్ ఈఏ శ్వేత ముఖ్యఅతిథిగా పాల్గొన్ని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల సమగ్ర వికాసమే లక్ష్యం : ఏయూ రిజిస్ట్రార్


చిన్నారులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల సమగ్ర వికాసం, అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తుందని రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, యోగా, వ్యక్తిత్వ వికాసం, భావవ్యక్తీకరణ తదితర అంశాల్లో స్కూలు సిబ్బంది అవసరమైన తర్ఫీదును అందించి వారి సమగ్ర వికాసానికి తోడ్పడుతున్నారని పాఠశాల కరస్పాండెంట్ బి.ప్రసాదరావును అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, యోగ విద్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవంలో బాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లీట్ సపోర్టు ఓడ నిర్మాణానికి కీల్‌లెయింగ్


ఓడ నిర్మాణ పనులు చేపట్టే ముందు పూజ చేస్తున్న పీఏడీఎం అధికారి బి.శివకుమార్

మల్కాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో ఫ్లీట్ సపోర్టు ఓడ నిర్మాణ పనులకు ఇండియన్ నేవీ కంట్రోలర్ వార్ షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విజిషన్ అధికారి పీఏడీఎం అధికారి బి.శివకుమార్ గురువారం కీలు లెయింగ్ చేశారు. దీంతో షిప్‌యార్డు ఓ ముఖ్యమైన మైలురాయిని దాటినట్టు అధికారులు భావిస్తున్నారు. ఇండియన్ నేవీ నుంచి ఆర్డర్ పొందిన ఈ వెసెల్‌ను షిప్‌యార్డులో గల బిల్డింగ్ డాక్‌లో నిర్మించనున్నారు. షిప్‌యార్డుకు ఆధునిక యుద్ధనౌకలను నిర్మించడంలో సామర్థ్యం ఉందని భారత నౌకాదళం విశ్వసించి ఈ ఆర్డర్ ఇచ్చింది.

హెచ్‌ఎస్‌ఎల్ నిర్మాణంలో 44000 టన్నుల ఫ్లీట్ సపోర్టు ఓడ 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న మొట్టమొదటిది. ఇది సముద్రంలో ఇంధనం, నీరు, మందుగుండు సామగ్రి నింపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 2010లో రక్షణ మంత్రిత్వ శాఖలో విలీనం అయినప్పటి నుంచి షిప్‌యార్డుకు కీల్‌లెయింగ్ ఒక కల. ఇప్పుడు సాకారం కావడంతో హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

జాబ్‌మేళాలో 80 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 80మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జేకేసీ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 4 సంస్థలు పాల్గొనగా 220 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కల్యాణ్ జ్యూయలర్స్ సంస్థకు 13 మంది, శ్రీతామిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు 42మంది, ఎస్‌కేఎల్ అసోసియేట్స్‌కు 21 మంది, హెటిరో డ్రగ్స్‌కు 8 చొప్పున మంది ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలు మెరుగుపర్చుకుని జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రమేశ్‌నాయుడు, జేకేసీ కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ తదితరులు పాల్గొన్నారు.

యువతరం జ్ఞానాన్వేషకులుగా నిలవాలి

» ఏయూ వీసీ శశిభూషణరావు


పుస్తక ప్రదర్శన సందర్శిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువతరం జ్ఞానాన్వేషకులుగా నిలవాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు పేర్కొన్నారు. గురువారం ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విలువైన అరుదైన పుస్తకాలను నేటి తరానికి పరిచయం చేసే విధంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి సిబ్బందిని అభినందించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, యువతరం వీక్షించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఏయూ గ్రంథాలయం ఎంతో ఉపయోగంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'షాకిల్స్ ఆఫ్ షాడో' ఆంగ్ల కవితా పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రవి విన్సెంట్ రాసిన "షాకిల్స్ ఆఫ్ షాడో" ఆంగ్ల కవితా సంపుటిని ఏయూ వీసీ జి.శశిభూషణరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 52 విభిన్న కవితలు రచయిత రవి విన్సెంట్ సమాజాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలించి రాసినవని అభినందించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఎన్.సాల్మన్ బెన్నీ, ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో ఉద్యోగాలంటూ నకిలీ నియామక పత్రాలతో మోసం

» పోలీసుల అదుపులో ఇద్దరు బాధిత మహిళలు
» నిందితుడు అల్లిపురానికి చెందిన వ్యక్తి

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నకిలీ నియామక పత్రాలతో 'విమ్స్'కు వచ్చి సీనియర్ అసిస్టెంట్లుగా చేర్చుకోవాలంటూ కోరిన ఇద్దరు మహిళలను ఆరిలోవ పోలీసులకు అప్పగించినట్టు ఆస్పత్రి డైరెక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈ నెల 12న ఇద్దరు మహిళలు వచ్చి తమకు విమ్స్‌లో ఉద్యోగాలు వచ్చాయని, విధుల్లో చేర్చుకోవాలని కోరుతూ నియామక పత్రాలు చూపించారని తెలిపారు. అయితే వాటిని పరిశీలిస్తే.. అవి నకిలీవిగా తేలినట్టు వెల్లడించారు. గతంలో విమ్స్ డైరెక్టర్‌గా పని చేసిన సత్యవరప్రసాద్ సంతకం చేసినట్టు ఉందని, అయితే ఆ పత్రాలు నకిలీవని తెలిపారు. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్టు డాక్టర్ రాంబాబు చెప్పారు. వీరిద్దరికీ నగరంలోని అల్లిపురంలో ఉంటున్న వంశీ అనే వ్యక్తి ఒకరి నుంచి రూ.1.2 లక్షలు, మరొకరి వద్ద రూ.2 లక్షలు చొప్పున తీసుకొని నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చినట్టు తెలిసిందన్నారు.

ఈ వ్యవహారంపై కేసు నమోదు శామని, దర్యాప్తు చేస్తున్నామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

» వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్


జ్యోతి ప్రజ్వలన చేసిన బాలల దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

సిరిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు ఆటల్లో చిన్నారులు రాణించాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. గురువారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సెంట్రల్ టాక్స్ అదనపు డైరెక్టర్ ఐఆర్ఎస్ రవికిరణ్, బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల్లో ఉన్న కళాత్మకత, సృజనాత్మకతలను వెలికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, డీఎఫ్‌వో శివాని, ఇంజనీర్ రామరాజు పాల్గొన్నారు.

చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ విక్రయులు చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో చిరుతిండుబండరాలు తయారు చేసి ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులు తయారు చేసిన చిరుతిళ్లను స్టాల్స్‌లో పెట్టి విక్రయించారు. తల్లిదండ్రులు ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొని ఫుడ్‌ను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వాణిశ్రీ స్కూల్ నిర్వాహకురాలుమళ్ల శర్వాణి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, క్యారేజీల పంపిణీ


విద్యార్థులతో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు ధర్మేంద్ర తదితరులు

సిరిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో బాల్యం దశ దేవుడిచ్చే వరమని, అటువంటి బాల్యాన్ని పిల్లలందరికీ అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మేంద్ర, సెక్రటరీ శ్రావణి, యూత్ సర్వీసెస్ డైరెక్టర్స్ ఆశా, కరుణ పేర్కొన్నారు. గురువారం సిరిపురం డౌన్ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ క్యారేజీ బాక్సులను రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల మధ్య కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సభ్యులు అవంతి, శ్రీదేవి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు పాఠశాలలో చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నెహ్రూకు సంబంధించిన విషయాలను వినిపించారు. బాలల దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రమణి మాట్లాడుతూ బాలల దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. హెచ్‌బీకాలనీలో శ్రీశారద విద్యానిలయంలో చిన్నారులంతా పలు వేషధారుణలతో విశేషంగా ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని మైమరిపించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయలకు పాల్పడుతున్న ముగ్గురి అదుపులోకి తీసుకున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. తొలుత శ్రీకాంత్‌నగర్ వద్ద గంజాయి అమ్మకాలు సాగిస్తున్న మహ్మద్ లీ (33)ని అదుపులోకి తీసుకొని కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఆయన సుందరయ్యనగర్‌కు చెందిన రౌడీ షీటర్ అని తెలిపారు. గంజాయి ఎక్కడ నుండి వచ్చిందని ఆరా తీయగా, మరి కొందరి పేర్లు చెప్పినట్టు సీఐ తెలిపారు. అల్లిపురంలో గల ఓ లాడ్జిలో 206 రూంలో గల కల్లెపల్లి దుర్గాప్రసాద్ (33), కంచరపాలెంలోని బాపూజీనగర్‌కు చెందిన పొంగి లలిత కలసి ఈ గంజాయి విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నారు. వీరు అల్లూరి సీతారామజిల్లాలోని ముంచింగిపుట్టుకు చెందిన వారి నుంచి గంజాయి కొని ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నట్టు సీఐ చెప్పారు. వీరి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకొని వారి ముగ్గురిని అదుపులోకి తీసుకొన్నట్టు చెప్పారు.

ఘనంగా బాలల దినోత్సవం

» చాచా నెహ్రూకు నివాళి


కళ్లకు గంతలు కట్టుకుని బొమ్మలు గుర్తిస్తున్న బాలలు, వీక్షిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

ఎంవీపీ కాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి, పలు విభాగాల అధికారులు రాధ, జీవవాణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లోని లిటిల్ కిడ్స్ ప్లే స్కూలులో చిన్నారులు బాలల దినోత్సవం సందర్భంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాల ఆడిటోరియంలో బాలల హక్కుల వారోత్సవాలు, జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు కాపాడతామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. బాల్యం భవిష్యత్తుకు పునాది వేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఉషోదయ కూడలిలోని కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూలులో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలు పలు కార్యక్రమాలను ప్రదర్శించారు. కళ్లకు గంతలు కట్టుకుని రంగులు చెప్పడం, బొమ్మలను గుర్తించడం వంటివి చేసి ఆశ్చర్యచకితులను చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహం ఆవిష్కరణ


సరస్వతీ విగ్రహం ఆవిష్కరణలో పాల్గొన్న అతిథులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులోని పెద్ద జాలరిపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం సరస్వతీదేవి ఆలయాన్ని ఆవిష్కరించారు. వైశ్యరాజు జ్యుయలర్స్ ఆర్థిక సాయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కోరిన మీదట సౌండ్ సిస్టమ్ కూడా త్వరలో అందజేస్తామని వైశ్యరాజు జ్యూయలర్స్ అధినేతలు భద్రగిరి రాజు వెల్లడించారు. కార్యక్రమంలో రవికుమార్, పీసీబీ రావు, సీతారాం, శివశంకర్, జనార్ధన్,లక్ష్మణరావు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు ఘనంగా సారె


అమ్మవారి సారెను ఊరేగిస్తున్న గ్రామస్థులు

వెంకోజీపాలెం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీ పాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో గురువారం అమ్మవారికి సారె మహోత్సవాన్ని నిర్వహించారు. సంఘంలోని మహిళలు ఒక్కొక్కరు కేజీపావు చొప్పున వివిధ రకాల మిఠాయిలతో పాటు, పండ్లతో పురవీధుల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఈ సారె మిఠాయిలను శనివారం నిర్వహించే అన్నదానంలో వినియోగించనున్నట్టు గ్రామ అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం గౌరవ అధ్యక్షుడు పీల వెంకటపరదేశినాయుడు, ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, సహాయ కార్యదర్శులు కర్రి రఘు, మళ్ల కనకరాజు, రాజగిరి సురేష్, మళ్ల శ్రీను, ఆడిటర్ మళ్ల రవికుమార్, గ్రామస్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగర శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి విచ్చేసి జాతీయ పతాకావిష్కరించారు. శుక్రవారం 15న పుస్తక ప్రదర్శన, నూతన సభ్యత్వ స్వీకరణ, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 'అడవులు-ఉపయోగాలు' అంశంపై, 9, 10 తరగతుల విద్యార్థులకు 'విద్యపై మానసిక ఒత్తిడి' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సత్యకుమార్, ప్రముఖ రచయిత సుసర్ల సర్వేశ్వరశాస్త్రి, గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సినీనటి శ్రీరెడ్డిపై విశాఖలో కేసులు

» పోసాని కృష్ణమురళీపై కూడా..

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీనటి శ్రీరెడ్డిపై విశాఖ నగరంలోని టూటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత పట్ల అనుచితవ్యాఖ్యలు చేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళ నాయకులు గనగళ్ల సత్య, భాగ్యక్ష్మి, సత్యవతి, లీలా తదితరులు గురువారం టూటౌన్ సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా క్రైం నంబర్ 282/2024తో కేసు నమోదు చేసినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా తెలుగు మహిళల ఫిర్యాదు మేరకు శ్రీరెడ్డిపై కేసు నమోదుచేశారు.

మరో సినీనటుడు పోసాని కృష్ణమురళీపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌లపై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసినందున చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నేత గండి బాబ్జీ చేసిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

వన భోజనాలకు వేళాయె...

ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ

కార్తీక మాసంలో ఇదో సత్సంప్రదాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సంఘ జీవనం భారతీయ సంస్కృతి. ఆచార సంప్రదాయాలు నేర్పింది ఈ సంఘ జీవనమే. పరస్పర సహకారం, సామూహిక సమ్మేళనాలు ఐక్యత, అభివృద్ధికి నాంది పలుకుతాయి. ఆధ్యాత్మిక, అనుబంధాల సమ్మేళనమే వనభోజనాలు. కార్తీక మాసం వచ్చిందంటే ఎవరికైనా టక్కున గుర్తుకు వచ్చేవి ఇవే. వన సమారాధనకు (పిక్నిక్‌లు) పురాణాల్లో ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఉరుకులు పరుగులే జీవితంగా మారిన ప్రస్తుత జీవన గమనంలో కాసింతైనా మనసుకు ఆహ్లాదం కలిగించే కార్యక్రమాల్లో వనభోజనాలు ఒకటని కచ్చితంగా చెప్పొచ్చు. వృత్తి ఉద్యోగాలతో బిజీగా ఉండే దంపతులకు, పుస్తకాలతో కుస్తీపట్టే పిల్లలకు ఓ ఆటవిడుపు. రోజంతా తమకు తెలియకుండా గడిచిపోయే వనభోజనాల కోసం జనం అందుకే అంత ఆసక్తిగా ఎదురుచూస్తారు. అనుబంధాలు చెరిగిపోయి... మమకారాలు కరిగిపోయిన ఈతరంలో కనీసం వన సమారాధన రోజైనా వాటిని మొగ్గతొడిగిస్తే కొంతలో కొంతైనా మేలు జరుగుతుంది.



హైందవ విశ్వాసాల్లో కార్తీక మాసానికి అగ్రస్థానం ఉంది. హరిహరాదులు ఇద్దరినీ పూజించే పవిత్ర మాసం ఇది. కార్తీక మాసంలో పూజలకు ఎంత ప్రాధాన్యం ఉందో వన భోజనాలకు అంతే ప్రాధాన్యం ఉంది. దేవతలు వనాల్లో విహరిస్తుంటారట. చెట్లపై కొలువుదీరుతారట. ఆలయాలు, క్షేత్రాలో కొండకోనల్లో వెలియడానికి కారణం కూడా ఆ ప్రాంతాలకు ముచ్చటపడిన దేవతలు అక్కడ కొలువుదీరాలని కోరుకోవడం వల్లే అంటారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. దానికింద భోజనం చేస్తే పుణ్యఫలం లభిస్తుందని నమ్ముతారు. విశ్వాసం, నమ్మకం అనే పునాదులపై అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ఇది. ఎన్నో ఔషధ గుణాలున్న ఉసిరి చెట్టు కింద సామూహిక వనభోజనాలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని పురాణేతిహాసాలు పేర్కొంటున్నాయి. అనేక ధార్మిక గ్రంథాల్లోనూ కార్తీక వనభోజనాల ప్రస్తావన ఉంది. మహర్షులు కూడా దీన్ని ఆచరించినట్టు చెబుతారు. అంతటి విశిష్టత, ప్రాధాన్యం ఈ తరంలో లేకపోయినా సంప్రదాయం ఏదో రూపంలో కొనసాగుతుండడం సంతోషించాల్సిన విషయం. అడవులు అంతరించిపోతున్న ఈ రోజుల్లో ఉసిరి చెట్లు కొరత ఉండడంతో ఏదో ఒక చెటు కింద సంప్రదాయాన్ని పూర్తిచేస్తున్నారు. సమగ్రత, సమైక్యతకు చిహ్నంగా చెప్పుకునే వనభోజనాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

ఉసిరి చెట్టే కాదు...అన్నీ వేదికలే

ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. అందుకే కార్తీక మాసంలో ఒక్కరోజైనా ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే ఆ దేవదేవుని అనుగ్రహం లభిస్తుందన్నది ఆధ్యాత్మిక వాదుల నమ్మకం. అంత మాత్రాన ఉసిరి చెట్టు లేకపోతే ఫలితం ఉండదనుకోనక్కర్లేదు. ఎవరి అభీష్టం మేరకు వారు నచ్చిన ప్రదేశాలను ఎంచుకుని కార్యక్రమాన్ని పూర్తి చేయవచ్చునంటున్నారు. కొందరు ఉద్యానవనాల్లో పిక్నిక్‌లకు ప్రాధాన్యం ఇస్తారు. మరికొందరు నదుల వద్ద, ఇంకొందరు సముద్ర తీరాల్లో జరుపుకుంటారు. తోటలు అందుబాటులో ఉన్న వారు ఆయా ప్రదేశాల్లో పిక్నిక్‌లు జరుపుకుంటుంటారు. విశాఖ లాంటి నగరాల్లో పర్యాటక



వనభోజనాల్లో కుటుంబ సభ్యులు

ప్రదేశాలే అతిపెద్ద పిక్నిక్ స్పాట్‌లుగా ఉన్నాయి.

ఆధ్యాత్మిక చింతనతో...

వనభోజనాలు ఆధ్యాత్మిక చింతనతోపాటు హైందవ ధర్మాన్ని చాటిచెబుతాయి. వన సమారాధన వల్ల ఆయుర్వేదంలో వృక్ష జాతికున్న విశిష్టత అందరికీ తెలుస్తుందని చెబుతారు. వండిన ఆహారాన్ని మహావిష్ణువుకు ప్రీతి అయిన ఉసిరి చెట్టు కింద తింటే మంచి ప్రతిఫలం ఉంటుందట. ఈ కారణంతోనే సామూహిక వనభోజనాలు

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పిల్లలతో పిక్నిక్‌కు వెళితే చాలా అప్రమత్తంగా ఉండాలి. వారు స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం ఇస్తూనే ఓ కంట గమనిస్తుండాలి. జలాశయాలు, సాగర తీరం వద్ద పిక్నిక్ అయితే అత్యంత అప్రమ త్తంగా వ్యవహరించాలి. జలపాతాల్లోనూ, సముద్రంలోనూ ఆటలు వద్దు. పిల్లల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలేయవద్దు వెంటే ఒకరు ఉండాలి.

- ఉసిరి చెట్టు కింద భోజనంతో ఎంతో ప్రయోజనం
- ఆధునిక యుగంలోనూ కొనసాగుతున్న విధానం

చేసే వారు ఇప్పటికీ ఉన్నారు. ప్రధానంగా దైవభక్తి, గ్రామీణ నేపథ్యం ఉన్నవారు ఇటువంటి సంప్రదాయాలను పాటిస్తున్నారు. వీరు మద్య, మాంసాహారం ముట్టుకోకుండా పిక్నిక్‌లు చేసుకుంటుంటారు. మారిన జనరేషన్‌లో ఇటువంటి వారిని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. దీక్షలు చేసే స్వాములు భక్తి భావంతో పిక్నిక్‌లు నిర్వహించుకుంటారు.

ఆహారం విషయంలో...

ఆహారం విషయంలో చక్కగా ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రద్దీ సమయాల్లో బయట ఆహారంతో ఇబ్బందులుంటాయి. ఇంటి వంటకాలకే ప్రాధాన్యం ఇస్తే మంచిది. కుటుంబాలు కలిసి వెళ్తున్నప్పుడు ఒక్కొక్కరూ ఒక్కో ఐటమ్ షేర్ చేసుకోవాలి. ఆహార పదార్థాలు హాట్ కంటైనర్లు, డిష్‌ల్లో తీసుకు వెళితే వేడిగా, రుచిగా ఉంటాయి. ఆహారం వృథాకాకుండా సరిపడేలా ముందే ప్లాన్ చేసుకోవాలి. సరిపడే స్థాయిలో మంచినీరు తీసుకువెళ్లాలి.

ముందస్తు ప్రణాళిక అవసరం

వనభోజనాల్లో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపి మధురానుభూతిని సొంతం చేసుకోవాలంటే ముందస్తు ప్రణాళిక తప్పనిసరి. ఎంతమంది వెళ్తున్నారో పక్కాగా నిర్ణయించుకుని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలి. సొంత వాహనమా, ఆర్టీసీ బస్సా అన్నది ముందుగానే నిర్ణయించుకుని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలి. వెళ్లే ప్రాంతంపై పూర్తి అవగాహన ఉండాలి. అక్కడి సదుపాయాలపై ఆరాతీయాలి. గతంలో వెళ్లే ప్రాంతం కంటే కొత్త ప్రదేశాన్ని ఎంచుకుంటే మంచిది. బడ్జెట్‌కు అనుగుణమైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. రాత్రిపూట చూడాల్సిన అందాలుంటే తప్ప చీకటి పడకముందే తిరుగు ప్రయాణం కావాలి. ఉదయం వేగంగా వెళితే ఎక్కువసేపు



ఉసిరిచెట్టుకు పూజలు

గడిపామన్న ఆనందం కలుగుతుంది. నీడనిచ్చే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి.

సెల్‌ఫోన్లు కాసేపు పక్కన పెట్టాలి

మనుషుల మధ్య అంతరాన్ని అనుబంధాలు, ఆత్మీయతలు చెరిపేస్తాయి. కానీ ఈతరం మధ్య దూరాన్ని పెంచేవి సెల్‌ఫోన్‌లు. సామాజిక మాధ్యమాల పరంగా దగ్గరగా ఉంటున్నామని కొందరు గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోవచ్చుగాని భావోద్వేగాల పరంగా వారి మధ్య దూరం పెరుగుతోంది. ఒకే ఇంట్లో ఉన్నా తల్లీకూతురు, తండ్రీ కొడుకు, భార్యాభర్త కలిసి ఆప్యాయంగా మాట్లాడుకునే సందర్భాలు అరుదవుతున్నాయి. సామాజిక మాధ్యమాలు పూర్తిగా సమయాన్ని ఆవిరి చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వనభోజనాల సమయంలోనైనా మొబైళ్లను పక్కనపెట్టడం వల్ల ఒకరి అభిప్రాయాలు మరొకరితో పంచుకునే వీలు కలుగుతుంది. వనభోజనాల రోజూ మొబైళ్లను నమ్ముకుంటే ఇక సందడి పోయినట్టే.

మేలురకం విత్తనాలు రైతులకు సమకూర్చండి

గండి బాబ్జికి మంత్రి లోకేశ్ సూచన



లోకేశ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బాబ్జి. చిత్రంలో పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, సీతంరాజు సుధాకర్ ఉన్నారు

పెందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి గురువారం అమరావతిలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు బాబ్జి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ద్వారా పంటలకు మేలురకం విత్తనాలు సరఫరా చేసి, రైతు సంక్షేమానికి కృషి చేయాలని లోకేశ్ సూచించారు. బాబ్జి వెంట రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ భరత్, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

జగదాంబ కూడలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంచుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హితవు పలికారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

గ్రంథాలయాలు సందర్శించడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా మనస్సును ఆహ్లాదకరంగా ఉంచుకోగలుగుతారని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల నగర పర్యటనలో భాగంగా గ్రంథాలయాల పరిస్థితులను తెలుసుకున్నారన్నారు.

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గ్రంథాలయాల్లో పత్రికలు, పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చునని కలెక్టర్ సూచించారు. బాలల దినోత్సవంలో భాగంగా తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులతో సంభాషించారు. పోటీ పరీక్షలకు అవసరమైన అధ్యయన అంశాలు లభిస్తున్నదీ, లేనిదీ యువతను ఆరా తీశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు, డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు, ఏఈవోలు, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది డైవర్షన్ పాలిటిక్స్: మాజీ మంత్రి

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కూటమి ప్రభుత్వంలోని పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్

గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని చంద్రబాబు చెప్పారని, బడ్జెట్ ప్రసంగంలో మాత్రం రూ.6.40 లక్షల కోట్లు అప్పులున్నట్టు చూపించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. టీడీపీ వాళ్లే తమపార్టీ నాయకుల పేరుతో ఫేక్ ఐడీలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయనన్నారు. సోషల్ మీడియా కార్యకర్తల తర్వాత తమను కూడా అరెస్టు చేస్తారని, దేనికైనా తాము సిద్ధమేనని అమర్‌నాథ్ పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రవిరెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.



నేడు వరాహ పుష్కరిణి వద్ద పుణ్యనదీ హారతి

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వరాహ పుష్కరిణిలో శుక్రవా రం పుణ్యనదీ హారతి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షణలో అధికా రులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 5 గంటలకు కొండదిగువన ఉన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్కరాణి వద్దకు తీసుకువస్తారు. ముందుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి వారిని ఉంచి ఉపచారాలు సమర్పించి, శాస్త్ర విధానంలో పలు రకాల హారతులు ఇస్తారు. అలాగే భక్తులు కూడా పుష్కరిణి ఒడ్డున దీపారాధనలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అర్జున అవార్డుకు ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత క్రీడా రంగంలో ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డులు నెలకొల్పడమే కాక అద్భుతమైన విజయాలతో దేశానికి పతకాలను అందించిన జ్యోతి పేరును ఈ అవార్డుకు సిఫార్సు చేయడం జిల్లా అథ్లెటిక్స్ సంఘానికి గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె విజయమే లక్ష్యంగా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్స్‌కు చేరడం విశేషమన్నారు. అంకితభావం, పట్టుదలకు నిదర్శనంగా నిలిచి యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చిందన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈడీని పరామర్శిస్తున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు

ఆర్టీసీ ఈడీని పరామర్శించిన చైర్మన్

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై నగరంలోని ఎన్‌ఆర్‌ఐలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డిని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు గురువారం పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో నారాయణరావు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. చైర్మన్ వెంట ఇన్‌చార్జి ఈడీ ఎ.విజయకుమార్, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ వాణీ నీలిమ ఉన్నారు.

డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు తగ్గని ఆదరణ



ప్రదర్శనలోని పుస్తకాలను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ఆదరణ తగ్గకుండా అన్ని రకాలను ఒకే చోట సమకూర్చి పుస్తక ప్రియులను ఆకర్షించడంలో విశాలాంధ్ర ఎనలేని కృషి చేస్తోందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అన్నారు. గురువారం మహారాణిపేట టర్నర్ చౌల్ట్రీలో పూర్వ ఉపకులపతి వి.బాలమోహనదాస్, సీపీఐ నాయకులు ఎ.జె.స్టాలిన్, ఎం.పైడిరాజు, డీజీఎం మనోహర్ నాయుడుతో కలసి విశాలాంధ్ర 23వ పుస్తక ప్రదర్శనను కమిషనర్ ప్రారంభించారు అనంతరం పుస్తకాలను తిలకించి సమీక్షించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తకప్రియుల సంఖ్య తగ్గలేదని, పుస్తక పఠనంతో ప్రయోజనాలను గ్రహించడం వల్లే ఎనలేని ఆదరణ కనిపిస్తోందని కమిషనర్ అన్నారు. విశాలాంధ్ర



ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే పుస్తకాన్ని తిలకిస్తున్న యువతి

అభ్యుదయ భావాలతో అందరికీ అందుబాటు ధరలలో ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజు, అప్పలరాజు, అచ్యుతరావు, సుకుమారన్, రామారావు, శ్రీనివాసరావు, విశాలాంధ్ర బ్యూరో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ: జేసీ

ఎండాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం ఆయన ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాంతంలో ఉన్న జిల్లా వ్యవసాయాధికారి సమావేశం మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లంలో ధాన్యం తేమ శాతం తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. గతంలో మాదిరిగా తేమ శాతం వ్యత్యాసానికి అవకాశం లేకుండా పరికరాలను సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వెళ్లే వరకు జీపీఎస్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. రబీ సీజన్‌లో వరి సాగు తగ్గించి చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ముఖ్యంగా రాగి సాగును ప్రోత్సహిస్తూ ప్రస్తుతం ఉన్న సాధారణ విస్తీర్ణం కంటే మూడు రెట్లు విస్తీర్ణం పెంచాలన్నారు. రాగి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ కార్యాలయం, పురుగు మందుల పరీక్షా కేంద్రం, జీవ నియంత్రణ పరీక్ష కేంద్రం, భూసార పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, పౌర సరఫరాల అధికారి పి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఉరి వేసుకుని ఆత్మహత్య

గోపాలపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 89వ వార్డు ఖారవేలనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న ఓ భవనంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం భవనం యజమాని రమణ గుర్తించి గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు బిహార్‌కు శంభుసదాగా గుర్తించారు. ఈ వ్యక్తి ఇక్కడకు వచ్చి ఉరి వేసుకోవడానికి కారణమేమిటనే విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భవన యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కె.సతీశ్ తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

లంకెలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే గేటు వద్ద గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. కంచరపాలెం ప్రాంతానికి చెందిన రొక్కం శేషగిరిరావు(50) స్థానిక కూడలిలో గల ఓ హోటల్‌లో పనిచేస్తూ స్థానికంగా నివాసముంటున్నాడు. ఉదయం లంకెలపాలెం నుంచి జాతీయ రహదారి కూడలికి నడిచి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని దువ్వాడ జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ మహిళ వద్ద గంజాయి పట్టివేత

పెందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బస్సులో గంజాయి తరలిస్తున్న దివ్యాంగ మహిళను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కెవీ సతీశ్‌కుమార్ గురువారం తెలిపారు. అరకు నుంచి విశాఖకు వస్తు న్న ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో సరి పల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. సంధ్యారాణి అనే దివ్యాంగ మహిళ వద్ద రెండు కేజీల గంజాయి ప్యాకెట్టు లభ్యమైందని సీఐ చెప్పారు.

చోరీ సొత్తు స్వాధీనం

ఎండాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది జరిగిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ ఏసీపీ వెంకటరావు తెలిపారు. గురువారం ఆయన పీఎంపాలెం క్రైం విభాగం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబరు 5న పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో నివాసం ఉంటున్న కరసవలస ధనుంజయరావు తన భార్యకి అనారోగ్యం కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఈమేరకు అదే నెల 6న ఇంటి తలుపులు పగలగొట్టి 18 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. ఈ కేసులో పోలీసులు అప్పట్లోనే కోరాడ కరుణాకుమార్‌ను అరెస్టు చేశారు. ఏ1గా ఉన్న గర్భానా ఆనందరాజును అరెస్టు చేయడానికి ప్రయత్నించగా అరిలోవ స్టేషన్‌లో మరో కేసులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్నాడు. బెయిల్‌పై వచ్చిన ఆనందరాజును గురువారం అదుపులోకి తీసుకుని విచారించి, చోరీ సొత్తు రికవరీ చేయడంతో పాటు రిమాండ్‌కి తరలించినట్టు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఆయనతో పాటు సీఐ ప్రకాశ్, ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

మైథలాజికల్ థ్రిల్లర్‌గా 'దేవకి నందన వాసుదేవ'

హీరో గల్లా అశోక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో గల్లా అశోక్, హీరోయిన్ మానస వారణాసి, తదితరులు

డాబాగార్డెన్స్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైథలాజికల్ థ్రిల్లర్‌గా 'దేవకి నందన వాసుదేవ' చిత్రం ఉండనుందని హీరో గల్లా అశోక్ అన్నారు. మంచి కమర్షియల్ సినిమాకు వినోదం మేళవించామన్నారు. గురువారం హోటల్ దసపల్లాలో చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రానికి హనుమాన్ దర్శకుడు, ప్రశాంతవర్మ కథను అందించారన్నారు. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే చిత్రం ట్రైలర్, టీజర్‌లకు మంచి స్పందన వస్తోందన్నారు. మంచి చేయాలనుకునే వారికి ఎప్పుడూ దేవుడు వెంటే ఉంటారని..సాయం చేసే వారే దేవుడనే ఇతివృత్తంతో ఈ చిత్రం ఉంటుందన్నారు. డైరెక్టర్ అర్జున్ ఈ సినిమాను చాలా బాగా తెరకెక్కించారన్నారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ మోడలింగ్ నుంచి తాను సినిమాల్లోకి వచ్చానన్నారు. చిత్రంలో తన పాత్ర అలరిస్తుందన్నారు. నిర్మాత బాలకృష్ణ మాట్లాడుతూ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు.